



జాయ్ జమీమియా కేసులో రాజకీయ నేతల పాత్రపై విచారణ

- ఒక మాజీ ఎంపీ కుమారుడి పాత్ర ఉన్నట్టు మా దృష్టికి వచ్చింది, దర్యాప్తు చేస్తున్నాం
- ముఠాలో మరికొందరిని అరెస్టు చేయాల్సి ఉంది
- సీపీ శంఖబ్రతబాగ్చి



విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హనీ ట్రాప్ చేస్తూ పలువురిని మోసం చేసి, వేధింపులకు గురి చేసిన జాయ్ జమీమియా కేసులో రాజకీయ నేతల పాత్ర ఏమైనా ఉందా?...అనే కోణంలో విచారణ జరుగుతోందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి తెలిపారు. పోలీస్ కమిషనరేట్‌లో మంగళవారం క్రైమ్ ప్రాపర్టీ మేళా నిర్వహించిన సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. జాయ్ జమీమియా కేసు దర్యాప్తుపై విలేకరుల ప్రశ్నకు స్పందిస్తూ ఆమెతోపాటు ఆమె ముఠా కారణంగా ఎంతోమంది జీవితాలు రోడ్డునపడ్డాయన్నారు. ఇప్పటికే ఆమెతోపాటు ఆమె ప్రధాన అనుచరుడు, బాధితులను వేధించడంలో కీలకంగా వ్యవహరించిన వేణురెడ్డి, కిషోర్‌లను అరెస్టు చేశామన్నారు. మరో ముగ్గురి పాత్ర ఉందని గుర్తించామని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. జమీమియాకు మద్దతుగా కొందరు రాజకీయ నేతలు మాట్లాడుతున్నారని, అసలు వారెందుకు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారనే దానిపై విచారణ చేస్తున్నామన్నారు. ఒక మాజీ ఎంపీ కుమారుడు కూడా ముఠాలో ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై కూడా విచారణ చేస్తున్నామన్నారు. నేరం చేసిన తర్వాత ఆధారాలను ఎలా చెరిపేయాలి, పోలీసులకు దొరికితే ఏం ప్రశ్నలు అడుగుతారు, వారికి ఎలాంటి సమాధానం చెప్పాలనే దానిపై ముందుగానే జమీమియా ముఠా శిక్షణ పొందడంతో కేసు దర్యాప్తు క్లిష్టంగా

... మిగతా 6వ పేజీలో

రెవెన్యూ సమస్యలు ఏకరువు

అధికారుల తీరుపై ఎమ్మెల్యేల అసంతృప్తి



- కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, ఇతర అధికారులతో ప్రాంతీయ సదస్సు నిర్వహణ
- మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరు
- నగరంలో 70 వేల మంది పేదలకు కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వాల్సి ఉందన్న ఎమ్మెల్యే గణబాబు
- గత ప్రభుత్వంలో జరిగిన భూ కుంభకోణాలపై విచారణ లేదు...తమ బాధ ఎవరికి చెప్పుకోవాలన్న వెలగపూడి
- క్రిస్టియన్ మిషనరీస్ భూములను 22ఏలో చేర్చాలని కోరిన పల్లా
- దసపల్లా భూముల వ్యవహారంపై విచారణకు డిమాండ్
- ప్రభుత్వ భూములతోపాటు ప్రైవేటు భూములు 22 ఏలో పెట్టడంతో ఇబ్బంది తలెత్తుతుందన్న ఎమ్మెల్సీ దువ్వారపు



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి విశాఖ జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

- తాడి గ్రామ తరలింపునకు చర్యలు తీసుకోవాలన్న పంచకర్ల
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదులపై తమకు సమాచారం ఉండడం లేదన్న సుందరపు
- జగనన్న కాలనీలకు భూ సమీకరణలో అవకతవకలు జరిగాయన్న బండారు
- విచారణ జరిపి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ

విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు గళం విప్పారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కరించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అధికారులు, ప్రతినిధులతో మంగళవారం మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరును ఎండగట్టారు. కొంతమంది అధికారుల తీరు దారుణంగా ఉందంటూ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు.

నగర పరిధిలో సుమారు 70 వేల మందికి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని, వారికి కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఈ సమస్య ఒక్క విశాఖ నగరంలోనే కాకుండా రాష్ట్రమంతటా ఉందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చెప్పారు. నాడు పట్టాల పంపిణీని చంద్రబాబునాయుడు పండగలా చేశారని, ఇప్పటికీ వారికి కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి పేషీ నుంచి లెటర్ వచ్చినా అధికారులు స్పందించడం లేదని వెలగపూడి ఆగ్రహం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కుంభకోణాలపై విచారణ లేదని, తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో కూడా అర్థం కావడం లేదన్నారు. అధికారులు వెళ్లిపోతామంటే

... మిగతా 6వ పేజీలో

అసలే చలి...ఆపై వర్షం

అల్పపీడనం ప్రభావంతో మరో రెండు రోజులపాటు భారీవర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెల కావడంతో చలి అధికంగా ఉంది. దీనికి తోడు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో మంగళవారం సాయంత్రం నుంచి నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తొలుత చిరుజల్లులుగా మొదలై ఆ తరువాత దపదఫాలుగా వర్షం పడుతూనే ఉంది. దీంతో చలి మరింత ఎక్కువైంది. అల్పపీడన ప్రభావంతో బుధ, గురువారాలు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలావుండగా అల్పపీడనం కోస్తా తీరం దిశగా పయనించే క్రమంలో సముద్రం నుంచి భారీగా తేమ రానున్నందున ఈనెల 21వ తేదీ వరకు ఉత్తర కోస్తా, మధ్య కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు, అక్కడక్కడా అతిభారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణుడు ఒకరు వెల్లడించారు. ప్రస్తుతం ఈశాన్య రుతుపవనాలు బలంగా ఉండడంతో కోస్తా జిల్లాలపై ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు.



హెలికాప్టర్ మ్యూజియం పనులు పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్, కమిషనర్

జనవరి నెలాఖరుకు హెలికాప్టర్ మ్యూజియం

- వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్కే బీచ్‌రోడ్డులో 'యుహెచ్-3హెచ్' హెలికాప్టర్ మ్యూజియం పనులు జనవరి నెలాఖరుకు పూర్తవుతాయని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌తో కలిసి ఆయన మ్యూజియం పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ పర్యాటక రంగానికి ఈ హెలికాప్టర్ మ్యూజియం మరో అదనపు ఆకర్షణగా నిలుస్తుందన్నారు. పనులు వేగంగానే జరుగుతున్నాయని, ఎక్కడా రాజీ పడవద్దని ఇంజనీరింగ్ అధికారులకు సూచించామన్నారు. ఆ తరువాత సిరిపురం జంక్షన్‌లోని మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవన నిర్మాణాన్ని కూడా ఇద్దరూ పరిశీలించారు. దీనిని కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి రెండింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులు మీదుగా ప్రారంభింపజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ బలరామరాజు, ఈఈలు సుధీర్, దుర్గాప్రసాద్, ఏఈ కార్తీక తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు రికవరీ చేసిన చోరీ సొత్తు

73 చోరీ కేసుల్లో 87 మంది అరెస్టు

- రూ.89.33 లక్షలు సొత్తు రికవరీ

విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది నవంబరు నెలలో 104 చోరీలు జరగ్గా 73 కేసులను ఛేదించినట్టు సీపీ శంఖబ్రతబాగ్చి తెలిపారు. ఆయా కేసుల్లో 87 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.89.33 లక్షలు రికవరీ చేశామన్నారు. కమిషనరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము ఛేదించిన వాటిలో దోపిడీ, ఇళ్లలో పగటిపూట, రాత్రివేళ చోరీలు, చైన్ స్నాచింగ్‌లు, ఆటో, కారు, మోటారు సైకిళ్ల చోరీ, జేబు దొంగతనం, తదితర కేసులు ఉన్నాయన్నారు. నిందితుల నుంచి 1.1 కిలోల బంగారం, 4.61 కిలోల వెండి వస్తువులతోపాటు 3.5 లక్షలు నగదు, 21 మోటారు సైకిళ్లు, ఒక ఆటో, ఒక కారు, 305 సెల్‌ఫోన్‌లు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఒక ప్రింటర్ రికవరీ చేశామన్నారు. నగరంలో నేరాల నియంత్రణతోపాటు నమోదైన చోరీకేసులను ఛేదించేందుకు తాము అమలుచేస్తున్న ప్రణాళిక మెరుగైన ఫలితాలను ఇస్తోందన్నారు. వివిధ సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో ఎనిమిది వేల సీసీ కెమెరాలను ఏర్పాటు

... మిగతా 6వ పేజీలో

మహా నిర్లక్ష్యం

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి రూ.16 కోట్ల విలువైన స్థలం

- డైమండ్ పార్క్ సమీపంలో 818 గజాలు ఓపెన్‌స్పేస్‌గా నగర పాలక సంస్థ రికార్డుల్లో నమోదు
- ఆ స్థలం తనదంటూ ప్రైవేటు వ్యక్తి వాదన
- హైకోర్టులో జీవీఎంసీకి, ప్రైవేటు వ్యక్తికి మధ్య కేసులు పెండింగ్
- ఈలోగా వివాదంలో ఉన్న స్థలం చుట్టూ ప్రహరీ గోడ కూల్చేసి చదునుచేసిన ప్రైవేటు వ్యక్తి
- అధికారులు అడ్డుకోకపోవడంపై అనుమానాలు



ప్రైవేటు వ్యక్తి చదును చేయించిన స్థలం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) నగర నడిబొడ్డున ఉన్న డైమండ్ పార్కు ప్రాంతంలో గజం రూ.లక్షల్లో ఉంటుంది. ఉంటుంది. అలాంటి చోట 818 గజాలు జీవీఎంసీ ఓపెన్ స్పేస్ కింద ఉంది. అయితే ఆ స్థలం తనదంటూ ఒక వ్యక్తి కొంతకాలంగా జీవీఎంసీపై న్యాయపోరాటం చేస్తున్నారు. అందులో భవన నిర్మాణానికి గతంలో ఒకసారి దరఖాస్తు చేస్తే అధికారులు తిరస్కరించారు. అయితే వివాదం తేలేంత వరకూ ఆగకుండా ఆ స్థలానికి ఉన్న ప్రహరీ గోడ కూల్చేసి, చదును చేసేశారు. ఆ స్థలంలో భవన నిర్మాణానికి మరోమారు దరఖాస్తు చేయడంతో మాజీ కార్పొరేటర్ భర్త జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

జీవీఎంసీ జోన్-3 పరిధి 27వ వార్డులో సంగం-శరత్ థియేటర్, కోణార్క్ లాడ్జి వెనుక 818 గజాల స్థలం ఉంది. 1950లో వైజాగ్‌పటం కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పేరుతో వేసిన లేఅవుట్‌లో ఆ స్థలాన్ని ఓపెన్‌స్పేస్ కింద జీవీఎంసీ (అప్పటి మునిసిపాలిటీ)కి అప్పగించారు. దీనిని జీవీఎంసీ ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. జీవీఎంసీ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఇప్పటికీ ఆ స్థలం ఖాళీగానే ఉండిపోయింది. ఇదిలావుంటే ఆ స్థలాన్ని సొసైటీ నుంచి కొనుగోలు చేశానంటూ ఒకరు అందులో భవన నిర్మాణం కోసం కొన్నాళ్ల కిందట జీవీఎంసీకి దరఖాస్తు చేశారు. దీనిపై మాజీ కార్పొరేటర్ భర్త కల్లేపల్లి వెంకట సీతారామరాజు అది ఓపెన్

... మిగతా 6వ పేజీలో

ఆర్ఈసీఎస్‌పై విచారణ

- పర్సన్ ఇన్‌చార్జిగా అనకాపల్లి కలెక్టర్‌కు బాధ్యతలు
- సంస్థ బ్యాంకు డిపాజిట్లు గల్లంతు
- ఈపీడీసీఎల్ చేతికి ఖాళీ ఖాతా పుస్తకాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సరఫరా సహకార సంస్థ (ఆర్ఈసీఎస్-రెస్కో)లో ఆర్థిక అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. సహకార రంగంలో ఉన్న ఈ సంస్థను ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) ఆదేశం మేరకు గతంలో ఏపీ తూర్పు విద్యుత్ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఆ సంస్థను గత మూడేళ్లుగా ఈపీడీసీఎల్ మంచి లాభాలతో నడుపుతోంది. ఇది సహకార రంగంలో ఉన్నప్పుడు అనకాపల్లి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశారు. ఆర్ఈసీఎస్ చైర్మన్, ఎండీలుగా పని చేసిన కొందరు తమకు నచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చుకొని జేబులు నింపుకున్నారు. ఇవన్నీ వెలుగుచూడడంతో నిధులు దుర్వినియోగం కాకుండా ఈఆర్‌సీ కట్టడి చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇతర కారణాలు చూపిస్తూ మళ్లీ ఆర్ఈసీఎస్‌ను సహకార సంస్థలోకి తేవాలని కొందరు

... మిగతా 6వ పేజీలో

జోరుగా అక్రమ నిర్మాణాలు

- ప్లాన్‌కు విరుద్ధంగా వ్యవహారం
- అనుమతి పొందిన దానికంటే అదనపు అంతస్థులు
- చోద్యం చూస్తున్న టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు

మద్దిలపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 22వ వార్డు పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అనుమతులు ఓ రకంగా తీసుకుని క్షేత్రస్థాయిలో మరో రకంగా పనులు చేస్తున్నారు. ఇరుకు రోడ్లలో భారీ భవనాలు నిర్మిస్తున్నారు. సెట్‌బ్యాక్స్ విడిచిపెట్టడం లేదు. అంతేకాకుండా అనుమతులు పొందినదానికంటే అదనపు అంతస్థులు నిర్మిస్తున్నారు.



శివాజీపార్క్ వరసిద్ధి వినాయక ఆలయం సమీపాన అక్రమ నిర్మాణం

అక్రమ కట్టడాల నివారణకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశాలు జారీచేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

ఐదు అడుగుల రోడ్డులో భారీ భవనం..

వార్డులోని శివాజీ పార్క్ రోడ్డులో వరసిద్ధి వినాయక ఆలయం వెనుక ఐదు అడుగుల రోడ్డులో ఒకరు భారీ భవనం నిర్మిస్తున్నారు. ద్విచక్ర వాహనం కూడా వెళ్లని రోడ్డులో ఏకంగా ఐదు ఫ్లోర్ల నిర్మాణం చేపడుతున్నారు. ఎటువంటి సెట్‌బ్యాక్స్ విడిచిపెట్టకుండా నిర్మాణం చేపట్టడంతో చుట్టుపక్కల వారు ఇబ్బందులకు గురవుతున్నారు.ఇక జీ+2 అనుమతులు పొంది జీ+3 నిర్మాణం చేపట్టారు. అంతేకాకుండా సెల్లార్‌లో కూడా నిర్మాణాలు చేయడానికి సిద్ధపడుతున్నారు. మంగాపురం కాలనీ

... మిగతా 6వ పేజీలో

కామ్రేడ్ శారదకు నివాళి

తగరపువలస, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస సీఐటీయూ కార్యాలయం వద్ద మంగళవారం కామ్రేడ్ శారద 20వ వర్ధంతిని నిర్వహించారు. శారద చిత్రపటానికి స్థానిక నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించి దివంగతురాలైన శారద లేని లోటు తీర్చలేనిదని సీఐటీయూ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకురాలు లక్ష్మి, శ్రీదేవి, పద్మ తదితరులు శారద చేసిన ఉద్యమాల గురించి వివరించారు. మహిళా సంఘం నాయకులు కె.నాగరాణి, సీఐటీయూ నాయకులు అప్పలనాయుడు, సూర్యనారాయణ మాట్లాడారు.

ఘనంగా ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు

తగరపువలస, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 2వ వార్డు పరిధి సంగివలసలో మంగళవారం పాస్టర్లు ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. డా. డీజే మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు క్రిస్టియన్ మత పెద్దలు హాజరయ్యారు. కుమార్‌రాజు, బిషప్ బాలరాజు క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. పాస్టర్లు జాషువా, పాల్ ప్రసాద్, బంగారయ్య తదితరులు ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు నూతన వస్త్రాలను అందజేశారు.

స్మార్ట్ మీటర్లను వాపసు తీసుకోవాలి



బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నేతలు

మధురవాడ, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిగ్ బిలియనీర్ అదానీకి విద్యుత్ చార్జీల పేరుతో ప్రజల సంపదను దోచిపెడుతున్నాయని సీపీఎం నాయకుడు పి.రాజ్‌కుమార్ ఆరోపించారు. స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ మధురవాడ విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం నేతలు మంగళవారం విద్యుత్తు బిల్లులను తగులబెట్టారు. స్మార్ట్‌మీటర్లు ఇళ్ల వద్ద ఏర్పాటు చేసి ప్రజలను ఆర్థిక దోపిడీకి గురిచేయవద్దని కోరారు. స్మార్ట్‌మీటర్లను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని సీపీఎం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.పైడితల్లి, డి.కొండమ్మ, బి.భారతి పాల్గొన్నారు.

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం

[illegible] నిత్య కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత [illegible] నం పలికారు. కప్పస్తంభ ఆలింగనం తర్వాత వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాలను పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు జరిపాక పండితులు ఆశీర్వచనాలివ్వగా, అధికారులు వారిని సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

రాములోరి ఆలయంలో సంక్షిప్త హవనం



సింహాచలం, డిసెంబరు 17: వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉపాలయంగా సింహగిరిపై ఉన్న సీతారామస్వామి ఆలయంలో సంక్షిప్త రామాయణ హవనాన్ని మంగళవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతినెలా వచ్చే శ్రీరాముని జన్మ నక్షత్రం పునర్వసును పురస్కరించుకుని రామషడక్షరీ సహిత సంక్షిప్త రామాయణ హవనం చేశారు. ఇందులో భాగంగా ప్రభాత సేవలు తర్వాత లక్ష్మణ, హనుమ, సీతా సమేత శ్రీరాముని ఉత్సవ మూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, బింబారాధన, కలశారాధన, మండపారాధనలు చేసి ముందుగా సిద్ధం చేసిన హోమకుండంలో అగ్ని ప్రతిష్ఠాపన గావించారు. అనంతరం సంక్షిప్త రామాయణంగా చెప్పుకునే రామాయణంలోని బాలకాండతో, అలాగే శ్రీరామ షడక్షరీ మంత్రాలతో హవనం జరిపి పూర్ణాహుతి జరిపారు. ప్రధాన కలశాన్ని శిరస్సున దాల్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అంతరాలయంలో స్వామి సన్నిధిలో ఉంచి పూజలు చేశాక పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ జరిపి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కాపులుప్పాడలో మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పి.సంపత్‌కుమార్

భీమునిపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాభివృద్ధిలో భాగంగా కాపులుప్పాడలో మాస్టర్ ప్లాన్ రహదారులను అభివృద్ధి చేయనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నాలుగో వార్డు పరిధి కాపులుప్పాడలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులోని నగరపాలెం జంక్షన్ నుంచి సోమన్నపాలెం, రెడ్డిలపాలెం, కాపులుప్పాడ మీదుగా బోయపాలెం జాతీయ రహదారి కూడలి వరకు ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రహదారిని ఆయన పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కాపులుప్పాడలో 40, 60, 100 అడుగుల రహదారుల పనులను వీఎంఆర్డీఏ అధికారులతో చర్చించాక అభివృద్ధి చేస్తామన్నారు. ఈ పర్యటనలో జీవీఎంసీ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు, డిసిపి హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ' పనితీరు దారుణం

మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

భీమునిపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెవెన్యూ శాఖ పనితీరు ఘోరంగా ఉందని భీమిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ డీవీఎస్ఎస్ఎన్ రాజు (వాసురాజు) అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు రెవెన్యూ పనితీరును తప్పుపట్టారు. మండల ఉపాధ్యక్షుడు బోని బంగారునాయుడు, తాళ్లవలస ఎంపీటీసీ సభ్యులు కోరాడ రమణ మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో అధికారులు అవలంభిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. జడ్పీటీసీ గాడు వెంకటప్పడు మాట్లాడుతూ పాస్ పుస్తకాలు, వన్ బిలు తదితర భూ సంబంధిత దరఖాస్తుదారులు కాళ్లరిగేలా తిరిగినా పని జరగడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సింగనబంధ సర్పంచ్ జీవీ నారాయణ మాట్లాడుతూ భూముల రీ సర్వేతో సమస్యను మరింత జఠిలం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై మండల తహసీల్దార్ కార్యాలయం హెచ్‌డీపీ సూరిశెట్టి శ్రీనుబాబు మాట్లాడుతూ సభ్యుల సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అన్నవరానికి రెగ్యులర్ సెక్రటరీని నియమించాలని మండల ఉపాధ్యక్షురాలు సుపతి దుర్గాలమ్మ కోరారు. గొల్లల తాళ్లవలసలో అంగన్‌వాడీ కేంద్రానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీ కోరాడ రమణ కోరారు. ఎంపీపీ వాసురాజు మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరవుతున్న భీమిలి మండల తహసీల్దార్, ఆర్ అండ్ బీ డీఈ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులపై జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాలని రిపోర్టు చేస్తున్నామన్నారు. అలాగే, మండల పరిషత్ కార్యాలయంలో శిథిలభవనాలకు రూ.55 లక్షల ఆస్తి పన్నుల బకాయిలు చెల్లించాలని జీవీఎంసీ అధికారులు నోటీసులు జారీ చేసినందున, సంబంధిత పన్నులను మినహాయించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో హనుమంతరావు, ఈవోపీఆర్డీ రమేష్‌నాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

జూట్‌మిల్లు పింఛనుదారుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పింఛనుదారులు

తగరపువలస, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జాతీయ పింఛనుదారుల దినోత్సవం సందర్భంగా మంగళవారం తగరపువలసలో జూట్ మిల్లు పింఛనుదారులు భారీ ర్యాలీ నిర్వహించారు. పింఛనుదారుల సంఘం అధ్యక్షుడు కానూరి రాంబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి నుంచి ర్యాలీ నిర్వహించి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పింఛనుదారుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలన్నారు. సీనియర్ పెన్షనర్ సింగిడి అప్పా రావు మాట్లాడుతూ ధరలు విపరీతంగా పెరిగి సామాన్యుల జీవనం ఇబ్బందిలో ఉన్న ప్రస్తుత పరిస్థితిలో కార్మికుల పింఛన్ల మొత్తం కనీసం రూ.9 వేలుగా నిర్ణయించాలని కోరారు. సీటీటీయూ నాయకుడు మూర్తి వీరికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జూట్‌మిల్లు పింఛనుదారుల సంఘ ప్రధాన కార్యదర్శి బాబూజీ, కోశాధికారి సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, ఉపాధ్యక్షుడు చిల్ల అప్పారావు, సీనియర్ పింఛనుదారుడు దేముడు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం జీవీఎంసీ కార్మికుల నిరసన

కొమ్మాది, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం 5వ వార్డు స్వతంత్రనగర్, మారికవలస కార్మికులు 6వ వార్డు జీవీఎంసీ జోన్-2 కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పండుగసమయంలో కూడా కార్మికులను పస్తులు ఉంచటం చాలా దారుణమని సీఐటీయూ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు వెంటనే ఇవ్వకపోతే పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి.నరసింగరావు, జి.కిరణ్, విజయ్,నరేంద్ర, జాన్ అచ్చియమ్మ, వరలక్ష్మి,సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పిలవకపోతే ఎలా?

మండల సర్వసభ్య సమావేశంలో ధ్వజమెత్తిన పేకేరు సర్పంచ్ నాయుడుబాబు



మాట్లాడుతున్న ఎంపీపీ శారదా ప్రియాంక

ఆనందపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో అభివృద్ధి పనులకు సంబంధించి తనతో తీర్మానం చేయించుకుని, శంకుస్థాపనను తనను ఆహ్వానించకపోవడం పట్ల పేకేరు సర్పంచ్ నాయుడుబాబు మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ధ్వజమెత్తారు. ఎంపీపీ డాక్టర్ మజ్జి శారదా ప్రియాంక అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశంలో ఎన్ఆర్‌జీఎస్ అధికారి తిరుమలరావు మాట్లాడుతుండగా పేకేరు సర్పంచ్ అడ్డుతగిలారు. గ్రామానికి ప్రథమ పౌరుడినైన తనను పిలవకుండా కార్యక్రమం చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. మరోసారి ఇలా జరిగితే ఉన్నతా ధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. పాలవలస సర్పంచ్ నాగోతి అచ్చియ్యమ్మ నరసింహులు మాట్లాడుతూ తమ పంచాయితీ పరిధిలో మూడు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయించి,తనను సంప్రదించకుండా వేరొకరికి పనులు కేటాయించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కోరారు. పశువైద్యాధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న ఆనందపురం పశువైద్య శిబిరం భవన నిర్మాణాన్ని దివీస్ సంస్థ రూ.40 లక్షలతో నిర్మించడానికి ముందుకు వచ్చిందని, అందువల్ల శిథిల భవనాన్ని తొలగించేలా తీర్మానం చేయాలని కోరగా, సభ్యులందరూ ఆమోదించారు. చందక సర్పంచ్ బంక శ్రీను మాట్లాడుతూ గతంలో పశువులకు ఇన్సూరెన్స్ ఉండేదని, ప్రస్తుతం అది లేకపోవడంతో పశువులు మృత్యువాత పడితే పాడిరైతులు నష్టపోతున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని వేడుకున్నారు. విద్యుత్ శాఖ ఏఈ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఎంతో మేలని మండలంలోని వెల్లంకి, వేములవలస, గంభీరం పంచాయతీల్లో వీటి ఏర్పాటుకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ పంచాయతీలను సోలార్ విద్యుత్ గ్రామాలుగా తీర్చిదిద్దితే.. ప్రథమ స్థానంలో నిలిచిన పంచాయతీకి ప్రభుత్వం రూ.కోటి అందజేస్తుందన్నారు. ఈ నిధులతో గ్రామాభివృద్ధి చేసుకోవచ్చన్నారు. రామవరం సర్పంచ్ ఎర్ర పైడిరాజు మాట్లాడుతూ పంచాయితీలో వీధి లైట్లను కూడా సోలార్‌వి ఏర్పాటు చేస్తే ఎంతో మేలు చేకూరుతుందన్నారు.మండల హెడ్ క్వార్టర్‌లో విద్యుత్ బిల్ కలెక్టర్ అందుబాటులో ఉండేలా చూడాలని సభ్యులు కోరారు. హౌసింగ్ ఏఈ శ్యామ్ మాట్లాడుతూ మండలంలోని హౌసింగ్ లేఅవుట్లలో 2,519 ఇళ్లకు గాను 1,159 పూర్తవ్వగా పూర్తికాగా మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. సమావేశంలో వ్యవసాయాధికారి సీహెచ్ సంధ్యారత్న ప్రభ, పీహెచ్‌సీ డాక్టర్ గంగునాయుడు, ఏఈ శ్రీనివాస్, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, ఎంపీడీవో డాక్టర్ జానకి, వైస్ ఎంపీపీ పి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

విశాఖ రూరల్ తహసీల్దార్ ఎం.పాల్ కిరణ్

ఎండాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని విశాఖ రూరల్ తహసీల్దార్ ఎం.పాల్ కిరణ్ అన్నారు. ఎనిమిదో వార్డు పరిధి ఎండాడ ముబారక్ కాలనీలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కారిస్తామన్నారు. ఈ సందర్భంగా 34 వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.హరితేజ, కార్పొరేటర్ నొడగల అప్పారావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిపాలెంలో సదస్సులో 13 వినతులు స్వీకరణ

భీమునిపట్నం: ఇక్కడి కృష్ణా కాలనీ వార్డు సచివాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 13 అర్జీలు స్వీకరించినట్టు తహసీల్దార్ రామారావు తెలిపారు. కుమ్మరిపాలెం గ్రామ రెవెన్యూ పరిధికి సంబంధించి ఈ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వోఆర్ మ్యూటేషన్లకు సంబంధించి 12, రెవెన్యూ సమస్యకు సంబంధించి ఒక దరఖాస్తు అందినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, దేవదాయ, ధర్మాదాయ శాఖాధికారులు, టీడీపీ నాయకులు వియ్యపు పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

బుడ్డివలసలో 21 వినతులు..

పద్మనాభం: మండలంలోని బుడ్డివలసలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 21 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కుల ధ్రువీకరణ కోసం పది, సర్వే ఆన్‌లైన్ సబ్ డివిజన్ కోసం నాలుగేసి వినతులు, మ్యుటేషన్ కోసం మూడు అర్జీలను ప్రజలు సమర్పించారు. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ శ్యామల, మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వో స్వామి, తదితరులు పాల్గొన్నారు.

73 చోరీ కేసుల్లో 87 మంది అరెస్టు

... 5వ పేజీ తరువాయి

చేశామన్నారు. నేరాల నియంత్రణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు వీలుగా 142 కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వీటన్నింటి కారణంగానే చోరీ జరిగిన వెంటనే రికవరీ చేయగలుగుతున్నామన్నారు.

అనంతరం రికవరీ చేసిన సొత్తును బాధితులకు సీపీ స్వయంగా అందజేశారు. కోర్టు చుట్టూ తిరిగే పని లేకుండా రికవరీ చేసిన వెంటనే సొత్తుని తమకు అందజేయడం ఆనందంగా ఉందని బాధితులు సంతోషం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, క్రైమ్ ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ ఎ.వెంకటరావు పాల్గొన్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

... 5వ పేజీ తరువాయి

నందిబొమ్మ వద్ద మరొకరు జీ+2కు అనుమతులు పొంది సెట్ బ్యాక్స్ విడిచిపెట్టకుండా జీ+3 నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాల విషయంపై జోన్-3 ఏసీపీ మధుసూదనరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'జీవీఎంసీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి'

మధురవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రజారోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు నవంబరు నెల వేతనాలను ఇప్పటివరకు చెల్లించకపోవడంతో ఏడో వార్డు కార్మికులు మంగళవారం మధురవాడ ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వేతనాలు అందక ఆర్థిక సమస్యలతో అల్లాడుతున్నామన్నారు. నాయకులు బి.అప్పారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారు ఏర్పాటుకు స్థల పరిశీలన

ఎండాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎండాడ ప్రాంతంలో కొత్తగా రైతు బజారు ఏర్పాటు కోసం మంగళవారం రూరల్ తహసీల్దార్ ఎం.పాల్ కిరణ్, మార్కెటింగ్ విభాగం (రైతు బజారు) ఏడీ, జోన్-2 కమిషనర్ ఫణిరామ్‌లు ఇక్కడి యూపీహెచ్‌సీ పక్కనే ఉన్న స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఇక్కడ రైతు బజారు ఏర్పాటు చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇచ్చిన హామీ మేరకు స్థల ఎంపిక, రైతు బజారు ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలించారు. ప్రజా ఆస్పత్రి పక్కన రైతు బజారును ఏర్పాటు చేస్తే సమస్యలు తలెత్తే అవకాశం ఉందనిస్థానికులు తహసీల్దార్‌కు తెలిపారు. సుభాష్‌నగర్‌లో ప్రభుత్వ స్థలం ఉందని, అక్కడ ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యకమంలో కార్పొరేటర్ అప్పారావు, కూటమి నాయకులు చెట్టుపల్లి గోపి, శాఖరీ శ్రీనివాస్, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు



సింహాచలం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను జరిపాక ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి ఆలయ విద్వాంసుల సన్నాయి వాయిద్యాల నడుమ బేడా మండపంలో తిరువీధి జరిపారు. స్థానాచార్యులు డాక్టర్ టీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో పండితులు తిరుప్పావై రెండవ పాశురాన్ని, వేదాలను అనుసంధానం చేశారు. గోదాదేవి ఆలయంలో ప్రత్యేక సేవాకాలం జరిపి షోడశోపచారాలు సమర్పించారు. అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించాక భక్తులకు తీర్థ గోష్ఠి నిర్వహించారు. అలాగే కొండదిగువన గల ఉద్యానవనంలో కొలువుదీరిన పద్మావతి, అలిమేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు.

రెవెన్యూ సమస్యలు ఏకరువు

... 5వ పేజీ తరువాయి

ఎలాగని సిసోడియాను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. 388 జీవో ప్రకారం ఆక్రమణలకు పాల్పడిన ఏడు వేల మందికి రెగ్యులర్ చేశామని అధికారులు చెబుతున్నారని, కానీ, గత ప్రభుత్వం నాలుగు వేల మందికి మాత్రమే చేసిందన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏకు లేఖ రాసినా స్పందన లేదన్నారు. రూపాయి ఖర్చు లేని పనులను కూడా తాత్సారం చేస్తున్నారన్నారు. 'మంచి ప్రభుత్వమని మనం చెప్పుకోవడం కాదు. ప్రజలు చెప్పుకోవాలంటే సరిగా పనిచేయాలి' అని వెలగపూడి స్పష్టంచేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నగర పరిధిలోని కీలకమైన ప్రాంతాల్లో ఉన్న సీబీసీఎన్‌సీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. దేవదాయ శాఖకు చెందిన భూములను 22లో పెట్టి ఆక్రమణలకు గురికాకుండా కాపాడుతున్నామని, మరి క్రిస్టియన్ మిషనరీలకు చెందిన భూములను అందులో చేర్చి ఎందుకు పరిరక్షించకూడదని పల్లా ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల కోట్ల రూపాయల విలువైన క్రిస్టియన్ ల్యాండ్స్ ఉన్నాయని, వాటిని పరిరక్షించాలంటే 22-ఏ జాబితాలో చేర్చడం ఒక్కటే మార్గమన్నారు. దసపల్లా భూములపై తాము ప్రతిపక్షంలో ఉండగా పోరాటం చేశామని, ప్రభుత్వ భూములను రక్షిస్తామని చెప్పామన్నారు. అక్కడ నిర్మాణాలు జరిగితే తామేం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దసపల్లా భూములపై సరైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంటుకు సంబంధించి సరిహద్దు వివాదాలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి అనగాని మాట్లాడుతూ క్రిస్టియన్ భూములను 22ఏలో చేర్చడంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ 22-ఏలో ప్రభుత్వ భూములతోపాటు ప్రైవేటు భూములు చేరాయన్నారు. ఇరవై ఏళ్లుగా లేనిది ఇప్పుడు తన ఇంటి స్థలం 22-ఏలో చేరిందని, దానివల్ల రుణం తీసుకోవడానికి ఇబ్బంది అవుతోందని, తనలాంటి ఎంతోమంది ఇటువంటి ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్య అన్నిచోట్ల ఉందని, దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి సమాధానం ఇచ్చారు. ఇదే సమస్యపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ కలెక్టర్లు ఎన్‌వోసీ ఇచ్చి మళ్లీ 22ఏలో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. రాజకీయ బాధితులు (పొలిటికల్ సఫరర్స్), ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఇచ్చిన భూములను 22ఏలో చేర్చడంపై ఆయన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తంచేశారు. వీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టినట్టు మంత్రి సమాధానమిచ్చారు. టీడీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని డీఎంఎస్ పురం గ్రామాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించడం లేదని, ఈ గ్రామానికి సంబంధించి భూ వివాదాలు ఉన్నాయని, రీ సర్వే జరిపి రైతులకు మేలు చేయాలన్నారు. రీ సర్వేను రీ డిజైన్ చేస్తున్నామని, కొద్దిరోజుల్లోనే ప్రక్రియను ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు నేరుగా వెళ్లి చర్యలు తీసుకుంటున్నారని, స్థానికంగా ఉంటున్న తమకు కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ మారలేదన్న ఉద్దేశంతో ఒక నాయకుడికి చెందిన భూములను 22ఏలో చేర్చారని, రాజకీయ కక్ష సాధింపునకు 22ఏను మార్చుకున్నారని, దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలకు భూసేకరణలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని, కొందరు నాయకులు రూ.కోట్లు గడించారన్నారు. కొందరు బోగస్ వ్యక్తులు లబ్ధిదారులుగా చేరారని పేర్కొన్నారు.

ఈ ఇళ్ల పట్టాలను పదేళ్లపాటు అమ్మకూడదని, కానీ, 60 శాతం విక్రయాలు జరిగిపోయాయన్నారు. దీనిపై స్పందించిన మంత్రి అనగాని 22ఏలో తప్పులు జరిగాయని, దానిపై విచారణ జరిపిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఇళ్ల లబ్ధిదారుల్లో ఏడు లక్షల మంది బోగస్‌గా గుర్తించామన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ తాడి గ్రామం తరలింపు ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలు జారీచేస్తామని మంత్రి స్పష్టంచేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గం పరిధిలో 2.08 ఎకరాలు భూమి మాత్రమే ఉందని, దానిని పరిరక్షించుకోవాలన్నారు. కొందరు జర్నలిస్టుల పేర్లతో ఫిర్యాదులు చేసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని, అటువంటి ఫిర్యాదులపై అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. సనపల సీతారామ్ అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని పేర్కొన్నారు. జాతీయ రహదారిపై ఉన్న గ్రీన్‌బెల్టును ఆక్రమించి మరీ మాల్‌లోకి వెళ్లేందుకు నాలుగు ఎంట్రీలు, ఎగ్జిట్ పాయింట్స్ పెట్టారని, ప్రశ్నిస్తే జాతీయ రహదారుల శాఖ అధికారులు అనుమతి ఇచ్చారని చెబుతున్నారన్నారు. అనుమతులు ఇచ్చుకుంటూ పోతే గ్రీన్ బెల్ట్ ఉండదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దానిపై ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేస్తామని, ఇటువంటి వాటిని ఉపేక్షించబోమని మంత్రి స్పష్టం చేశారు. భీమిలి బిల్డింగ్ సొసైటీ సమస్యను పరిష్కరించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ కోరారు. దాదాపు రెండు వేల కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. గరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో తిమ్మాపురంలోని హేచరీస్ వల్ల చుట్టుపక్కల ప్రజలకు సమస్యలు ఎదురవుతున్నాయని, వెంటనే ఖాళీ చేయించి మరో చోట స్థలం కేటాయించాలన్నారు.

మహా నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

స్పేస్ అని అందులో ప్లాన్ ఇవ్వకూడదంటూ జీవీఎంసీకి ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ప్లాన్ దరఖాస్తును తిరస్కరించారు. దాంతో సదరు వ్యక్తి హైకోర్టులో కేసు వేయగా...జీవీఎంసీ అధికారులు కూడా అది ఓపెన్‌స్పేస్ స్థలమని పేర్కొంటూ మరో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో రెండు కేసులు హైకోర్టులో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలావుండగా రెండు నెలల కిందట అదే వ్యక్తి ఆ స్థలంలో భవన నిర్మాణం కోసం మరోమారు జీవీఎంసీకి దరఖాస్తు చేశారు. అక్కడితో ఆగకుండా ఆ స్థలానికి ఉన్న ప్రహరీ గోడను కూల్చేసి, చెత్తచెదారాలను తొలగించేసి, చదును చేశారు. స్థలాన్ని తన ఆధీనంలోకి తీసుకున్నారు. కేసు కోర్టులో ఉండగా స్థలంలోకి ప్రవేశించడం, అక్కడ ప్రహరీని ధ్వంసం చేయడం, కంటెయినర్‌ను ఏర్పాటుచేయడాన్ని దీనిపై జీవీఎంసీ అధికారులు అడ్డుకోవాల్సింది పోయి...తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో ఓపెన్ స్పేస్‌లో భవన నిర్మాణం కోసం ప్రైవేటు వ్యక్తి మరోసారి ప్లాన్‌కు దరఖాస్తు చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ కార్పొరేటర్ భర్త సీతారామరాజు ఇటీవల మరోసారి జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

రూ.16 కోట్లు విలువైన స్థలం అన్యాక్రాంతం

జీవీఎంసీ అధికారుల తీరుతో రూ.16 కోట్లు విలువైన స్థలం అన్యాక్రాంతమైపోతుందని ఫిర్యాదుదారుడు జీవీఎంసీ అధికారుల వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. నగరంలో డైమండ్ పార్కు ఏరియా అంటేనే పూర్తిగా వాణిజ్య ప్రాంతంగా గుర్తింపు ఉంది. అన్నిరకాల దుకాణాలు, షాపింగ్‌కాంప్లెక్స్‌లు, ఎలక్ట్రికల్ షోరూమ్‌లు ఉండడంతో అక్కడ భూమికి చాలా డిమాండ్ ఉంది. గజం ధర రూ.రెండు లక్షల వరకూ పలుకుంది. అలాంటిచోట 818 గజాలు స్థలాన్ని పరిరక్షించడంలో జీవీఎంసీ అధికారులు ఎందుచేతనో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయం టౌన్‌ప్లానింగ్ విభాగంలోని ఒక అధికారి వద్ద ప్రస్తావించగా, ఆ స్థలం లేఅవుట్‌లోని ఓపెన్‌స్పేస్‌గానే తమ రికార్డులో ఉందని, కానీ ప్రైవేటు వ్యక్తి మాత్రం తాను సొసైటీ నుంచి కొనుగోలుచేశామని, దానికి సంబంధించిన పత్రాలన్నీ ఉన్నాయంటూ వాదిస్తున్నారన్నారు. జీవీఎంసీకి కూడా ఆ స్థలం ఓపెన్‌స్పేస్‌గానే పేర్కొంటూ కోర్టులో కేసు వేసిందన్నారు. దీనిపై హైకోర్టులో రెండు కేసులు పెండింగ్‌లో ఉండడంతో అక్కడ నుంచి స్పష్టత వస్తేనేగానీ ప్లాన్ జారీ చేయలేమంటూ దరఖాస్తును తిరస్కరించామన్నారు.

ఆర్ఈసీఎస్‌పై విచారణ

... 5వ పేజీ తరువాయి

ప్రయత్నాలు మొదలెట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలో ఆర్ఈసీఎస్ విషయాలు ప్రస్తావించి, తగిన న్యాయం చేయాలని కోరగా, మంత్రి అచ్చెన్నాయుడు 51-ఏ విచారణ చేయిస్తామని ప్రకటించారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్‌ను ఆర్ఈసీఎస్‌కు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. సహకార సంస్థ నుంచి తగిన సమాచారం అడిగితే సరైన స్పందన ఉండడం లేదని కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలల పాటు ఇన్‌చార్జిగా ఉండాలని ఆదేశాల్లో స్పష్టంచేశారు.

డిపాజిట్లు గల్లంతు

అనకాపల్లి ఆర్ఈసీఎస్ సహకార సంస్థగా నడిపినప్పుడు ప్రతి ఏటా ఆడిటర్ ద్వారా ఆర్థిక వ్యవహారాల లెక్కలు సమర్పించేవారు. ఆ గణాంకాల ప్రకారం 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.41.09 కోట్ల డిపాజిట్లు బ్యాంకుల్లో ఉన్నాయని వెల్లడించారు. 2016-17లో రూ.42.86 కోట్లు చూపించారు. 2107-18లో రూ.40.03 కోట్లు ఉన్నాయని ప్రకటించారు. 2018-19లో ఆకస్మికంగా ఆ మొత్తం రూ.19.15 కోట్లకు తగ్గించి చూపించారు. 2020-21న సమర్పించిన ఆడిట్ రిపోర్టులో మొత్తం అన్ని డిపాజిట్లు కలిపి రూ.196.23 కోట్లు ఉన్నాయని తెలిపారు. అందులో వాటా మూలధనం, ప్రత్యేక రిజర్వులు, చట్టబద్ధ రిజర్వులు ఉన్నాయని ఆడిటర్ ఏవీఆర్ అండ్ కో నివేదిక సమర్పించింది. అయితే ఈఆర్‌సీ ఆదేశం మేరకు సంస్థను ఈపీడీసీఎల్‌కు అప్పగించినప్పుడు తమ దగ్గర ఎటువంటి డిపాజిట్లు లేవని అప్పటి అధికారులు చేతులెత్తేశారు. నామమాత్రపు నిల్వలు కలిగిన బ్యాంకు ఖాతాలను మాత్రమే అప్పగించారు. ఈ సందర్భంగా వారు నిధుల జమకు, ఖర్చులకు వేర్వేరు బ్యాంకు ఖాతాలు ఉపయోగించారనే విషయం బయటకు వచ్చింది. ఈపీడీసీఎల్ స్వాధీనం చేసుకున్న తరువాత వినియోగదారులకు సేవలు అందించడంపైనే దృష్టిపెట్టింది. గతంలో జరిగిన ఆర్థిక లావాదేవీల జోలికి వెళ్లకుండా గత వైసీపీ ప్రభుత్వం కట్టడి చేసింది. అప్పట్లో వైసీపీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి ఆర్ఈసీఎస్‌ను నచ్చినట్టు ఉపయోగించుకున్నారు. ఆ ప్రభుత్వంలోనే ఈపీడీసీఎల్ నుంచి మళ్లీ వెనక్కి తేవాలని యత్నించి విఫలమయ్యారు. ఇప్పుడైనా ఆర్ఈసీఎస్ ఆర్థిక వ్యవహారాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, కోట్లాది రూపాయలు దిగమింగిన వారి నుంచి రికవరీ చేయాలని అనకాపల్లి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జాయ్ జమీమియా కేసులో రాజకీయ నేతల పాత్రపై విచారణ

... 5వ పేజీ తరువాయి

మారిందన్నారు. బాధితులు తమ పరువు పోతుందనే భయంతో బయటకు రావడం లేదని, కనీసం పది మంది వరకూ బాధితులు ఉండవచ్చునని సీపీ అభిప్రాయపడ్డారు. జాయ్ జమీమియా గ్యాంగ్‌లో బీజేపీకి చెందిన నాయకుడు పాత్ర ఉన్నట్టు తమ దృష్టికి రాలేదన్నారు. ఆ పార్టీ కూడా ఇప్పటికే ఒకరిపై ఆరోపణలు వస్తున్నాయని, ఆ వ్యక్తికి పార్టీకి సబంధం లేదని ప్రకటన ఇచ్చిందని సీపీ గుర్తుచేశారు.



వేంకటేశ్వరస్వామికి హారతిస్తున్న అర్చకుడు

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

పెందుర్తి, డిసెంబరు 17: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వేకువ జామున హారతి, సేవాకాలం, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రామానుజాచార్యుల ఆధ్వర్యంలో శ్రీవారిని శోభాయమానంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం కొండ దిగువ నుంచి ఆలయం వరకు ఉచిత బస్సును నడుపుతున్నట్టు దేవస్థానం ఈవో నీలిమ తెలిపారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

పెందుర్తి, డిసెంబరు 17: ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి పెందుర్తి మండలంలోని సచివాలయాల సిబ్బందికి మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో కొల్లి వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల మంజూరుకు సంబంధించి అర్హులను గుర్తించి, లబ్ధిదారులను ఎంపిక చేయడంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. సీడీపీవో డి.నీలవేణి, ఈవోఆర్డీ అప్పలరాజు, మండల స్థాయి అధికారులు ఎంపీవీ సత్యనారాయణ, పి.పరమేశ్వరరావు, ఏపీ మల్లికార్జునరావు, ఇ.రాణి, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్ కార్మిక నాయకుడు మృతి



నర్సింగ్ యాదవ్ (ఫైల్)

మల్కాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (ఇంటక్) ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఇంటక్ ఉపాధ్యక్షుడు ఎదురు నర్సింగ్ యాదవ్ మంగళవారం మృతి చెందారు. గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలోని కొత్త నక్కవానిపాలెంలో కుటుంబంతో నివాసం ఉంటున్న ఆయనకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆస్పత్రికి బయలుదేరుతుండగా ఆరోగ్యం మరింత క్షీణించడంతో మృతి చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న వెంటనే అధిక సంఖ్యలో కార్మిక నాయకులు, కార్మికులు నర్సింగ్ ఇంటికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

షిప్పింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు బీఎంఎస్ నాయకుల వినతి

మల్కాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డు షిప్పింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కమాడోర్ రాకేశ్ ప్రసాద్‌ను బీఎంఎస్ నాయకులు మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి, పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో షిప్‌యార్డు బీఎంఎస్ అధ్యక్షుడు సింహాచలం, ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు నాగేశ్వరరావు, శ్యాంబాబు, రవికుమార్, దుర్గాప్రసాద్, జైకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● పుష్ప-2 : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 43, టమాటా 17, వంకాయలు (తెలుపు) 34,వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 42, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 28, క్యారెట్ 50 దొండకాయలు 40, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది)56, బరబాటి 40, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరు చిక్కుడు 28 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 48, కీరదోస 36, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండచిసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226



గ్రీన్ బెల్ట్ స్థలంలో నిర్మించిన షెడ్లు



ములగాడలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం..

జోరందుకున్న అక్రమ నిర్మాణాలు

- జీవీఎంసీ, రెవెన్యూ స్థలాలు హాంఫట్
- రామకృష్ణపురంలో గ్రీన్ బెల్ట్ ఆక్రమణ
- ములగాడలో ప్రభుత్వ స్థలం పరాధీనం

మల్కాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో ఆక్రమణలు జోరందుకుంటున్నాయి. జీవీఎంసీ, రెవెన్యూ స్థలాలు పరాధీనమవుతున్నాయి. రామకృష్ణాపురం సెయింట్ ఆన్స్ కళాశాల మార్గంలో జీవీఎంసీ అధికారులు గ్రీన్ బెల్ట్ కోసం కేటాయించిన స్థలం పూర్తిగా కబ్జాకు గురైంది. మెయిన్ రోడ్డు నుంచి చర్చి వరకు ప్రభుత్వ స్థలం అక్రమార్కులపరమైంది. ఈ స్థలాలను ఖాళీగా ఉంచాలని, ప్రజావసరాలకు వినియోగించాలని కోర్టు సూచించినా ఆక్రమణదారులు బరితెగించి మరీ నిర్మాణాలను పూర్తి చేసి, అద్దెలకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. ఈ స్థలంలో గతంలో తాగునీటి సరఫరాకు వీలుగా ట్యాంకును నిర్మించారు. దీనిని ఆనుకుని మరీ అక్రమార్కులు నిర్మాణాలు చేపట్టారు.

అదేవిధంగా ములగాడ తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ములగాడ జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం మార్గంలో కుడివైపున ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడి నివాసితులకు ప్రభుత్వం 60 గజాల చొప్పున ఉచితంగా స్థలాలు ఇచ్చింది. దీంతో వారిలో చాలామంది తమ స్థలాలకు వెనక ఉన్న భూములను ఆక్రమించేశారు. జీవీఎంసీ, రెవెన్యూ స్థలాల ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.





కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు... పక్కన సదస్సుకు అధిక సంఖ్యలో విచ్చేసి దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

సమస్యలతో వచ్చిన వారికి పరిష్కారం చూపాలి

రెవెన్యూ సదస్సులో అధికారులకు ఉద్బోధించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

మరో సబ్ స్టేషన్ ఏర్పాటుకు మూడు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తాం

పెదగంట్యాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమస్యలతో కార్యాలయానికి వచ్చిన వారిని మర్యాదగా పలకరించి, వారికి పరిష్కారం చూపాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లాశ్రీనివాసరావు రెవెన్యూ, పౌర సరఫరాలు, పోలీస్, ఇతర శాఖల అధికారులకు ఉద్బోధించారు. మండల పరిధిలో గల స్టీల్‌ప్లాంట్, ఏపీఐఐసీ, వుడా, హౌసింగ్ బోర్డు శాఖలకు సంబంధించిన భూములు ఎక్కువగా ఉన్నందున ఇక్కడ భూ వివాదాలు కూడా అధికంగానే ఉన్నాయన్నారు. మనసు పెట్టి పనిచేస్తే అన్ని సమస్యలకూ పరిష్కారం లభిస్తుందన్నారు. మండల కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాలుగు దశాబ్దాల క్రితం ఒక్కో నిర్వాసిత కుటుంబానికి స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం 107 చదరపు గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చిందని, ఇప్పుడు ఆ కుటుంబం మూడు, నాలుగు కుటుంబాలుగా పెరిగినందున వారందరికీ ఇళ్లు అవసరమన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇళ్ల స్థలాల కోసం దళారులకు డబ్బులిచ్చి మోసపోయినవారు ఎక్కువగా తన వద్దకు వస్తున్నారన్నారు. అలాగే పేదవాడు చిన్న ఇల్లు కట్టుకుంటున్నా పలువురు విలేకరులు బెదిరిస్తున్నారని, వార్తలు రాయకపోగా వారితో బేరాలాడుతుండడం మంచి పరిణామం కాదన్నారు. మండల పరిధిలో మరో సబ్ స్టేషన్ ఏర్పాటుకు మూడెకరాల ఎకరాల స్థలాన్ని కేటాంచేందుకు చర్యలు తీసుకుంటామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ పక్కన పదెకరాల స్థలాన్ని కండిషనల్‌గా హౌసింగ్ శాఖకు ఇచ్చి నిర్వాసితులకు ఇళ్లు కట్టి ఇవ్వాలన్న ప్రతిపాదనను గత వైసీపీ ప్రభుత్వం అతిక్రమించిందన్నారు. స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం వారి స్థలాల్లో చాలాకాలంగా ఇళ్లు కట్టుకున్న వాటిని రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ అమల అధ్యక్షతన జరిగిన సదస్సులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శైలజ, కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, బొడ్డు నరసింహపాత్రుడు, దల్లి గోవిందరెడ్డి, తిప్పల వంశీరెడ్డి, న్యూపోర్టు సీఐ దాలిబాబు, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, ప్రసాదుల శ్రీనివాస్, ఎం.పెంటయ్య, చినఅప్పారావు, ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన అర్జీదారులు

కాగా రెవెన్యూ సదస్సుకు అర్జీదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, తాముంటున్న ఇళ్లను రెగ్యులరైజ్ చేసి పట్టాలివ్వాలని, కేటాయించిన టిడ్కో ఇళ్లను అందజేయాలని, స్టీల్‌ప్లాంట్ భూ సేకరణ విభాగం కేటాయించిన స్థలాల రెగ్యులరైజేషన్‌కు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, తమకు కేటాయించిన స్థలాలను పలువురు ఆక్రమించుకుంటున్నందున తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు వినతులు అందజేశారు.

కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఆదేశాలు

'మార్నింగ్ వాక్ విత్ పబ్లిక్' కార్యక్రమంలో పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి-రూరల్, డిసెంబరు 17: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మంగళవారం ఉదయం అధికారులతో కలిసి 95వ వార్డు పరిధి వరలక్ష్మీనగర్, సంతోష్‌నగర్, స్వీపర్ల కాలనీలలో 'మార్నింగ్ వాక్ విత్ పబ్లిక్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లోని సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు జంగిల్ క్లియరెన్స్ చేసి పాములు, పందులు, కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని కాలనీలవాసులు ఎమ్మెల్యేను కోరారు.



పంచకర్ల రమేశ్‌బాబుకు సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

అదేవిధంగా వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ హైమావతి, టీడీపీ వార్డు అధ్యక్షుడు దాట్ల మధు, జనసేన నాయకులు కంచిపాటి మధు, కోన మోహన్, పి.పార్వతీ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

'పది'లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్

పెందుర్తి, డిసెంబరు 17: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ సూచించారు. మంగళవారం 97వ వార్డు పరిధి శాంతినగరం జడ్పీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాటాడడంతో పాటు పలు సూచనలు చేశారు. నిర్దిష్ట ప్రణాళికతో పాఠ్యాంశాలను చదివి అర్థం చేసుకోవాలన్నారు. సిలబస్ ఎంతవరకు పూర్తయిందో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొన్నారు. మంచి ఫలితాలు రాబట్టడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. హెచ్.ఎం.శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ప్రజల ఆందోళన



విద్యుత్ బిల్లులతో నిరసన తెలుపుతున్న ప్రజలు

గాజువాక, డిసెంబరు, 17: విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజలు మంగళవారం కరెంటు బిల్లులను ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. 70వ పరిధి వార్డు దశమికొండ ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజలు విద్యుత్ చార్జీల పెంపు దారుణమంటూ ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని, ట్రూ ఆప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొలగాని అప్పారావు, నరసింగరావు, వెంకటలక్ష్మి, మంగ, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.



నార్త్ సింహాచలం రోడ్డులో కొత్తపాలెం అండర్‌పాత్‌వే వద్దనున్న కల్వర్టు

కొత్తపాలెంలో ప్రమాదకరంగా కల్వర్టు

రెయిలింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

గోపాలపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇక్కడి రెయిలంగ్ శిథిలం కావడంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. నార్త్ సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి గోపాలపట్నం వెళ్లే ప్రధాన రహదారిలో కొత్తపాలెం అండర్‌పాత్‌వే వద్ద కల్వర్టుపై దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టుపై రెయిలింగ్ పూర్తిగా ధ్వంసమైంది. నార్త్ సింహాచలం నుంచి సింహాచలం రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఉన్న ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే కల్వర్టుపై రెయిలింగ్ లేకపోవడంతో రాత్రి వేళలో వాహన చోదకులు కల్వర్టు పైనుంచి కిందకు పడిపోవడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా కొత్తపాలెం అండర్‌పాస్‌వే నుంచి రాకపోకలు సాగించే వాహనచోదకులు ఈ కల్వర్టు వద్ద ప్రమాదాల బారిన పడుతున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి రెయిలింగ్ నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని సానికులు కోరుతున్నారు.

శ్రీహరిపురంలో ఘనంగా పెన్షనర్స్ డే

మల్కాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలోని విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సీనియర్ నాయకుడు యూవీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ పెన్షన్ పెన్షన్ భిక్ష కాదు హక్కు అని వైవీ చంద్రచౌడ్ సంచలనాత్మక తీర్పు రోజు పెన్షనర్లకు పండగ రోజు అని పేర్కొన్నారు. పదిహేనేళ్లుగా ఈపీఎఫ్-95 పెన్షనర్లకు మినిమం పింఛన్ రూ.తొమ్మిది వేలు చెల్లించాలని పోరాడుతున్న కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. దీనిని సాధించేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. అనంతరం పలువురు పెన్షనర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఆర్‌పీఏ పారిశ్రామిక ప్రాంత అధ్యక్షుడు సీహెచ్ తమ్మారావు, కె.నూకరాజు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మూర్తి, తాతాజీ, రమణ, ఆడారి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడి జంక్షన్‌లో స్టాపర్లను ఏర్పాటు చేయిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటరావు

కూడలిలో ప్రమాదాల నివారణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అగనంపూడి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి కూడలిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ వెంకటరావు తెలిపారు. చెప్పారు. ఇక్కడి కూడలిలో డివైడర్‌ను మూయకపోవడంతో ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుం టున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అమ్మో అగనంపూడి జంక్షన్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సీఐ స్పందించారు. ఈ మేరకు కూడలిని పరిశీలించడంతో పాటు పలువురు వాహనచోదకులతో, నివాసితులతో మాట్లాడారు. కూడలిలో డివైడర్ మూసివేతపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణకుగాను కూడలిలో స్టాపర్లతో డివైడర్‌ను మూసివేయించారు. కేవలం ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లేందుకు కాస్తా స్థలాన్ని ఉంచారు. అలాగే ఇక్కడ ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా సీఐ వెంకటరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

నేడు ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, పింఛన్‌దారులు, కార్మికులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని కోరుతూ కార్మిక కుటుంబాలు ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద బుధవారం నిర్వహించనున్న ధర్నాలో ప్రతి కార్మికుడు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,405 రోజులకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలను పూర్తి స్థాయిలో ఇవ్వకుండా కాలయాపన చేస్తుండడం ఉక్కు యాజమాన్య నిరంకుశ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. పెన్షనర్స్ డేని పురస్కరించుకుని ఈపీఎఫ్-95 పెన్షనర్స్ (స్టీల్‌ప్లాంట్, బెల్, షిప్‌యార్డు)కు చెందిన విశ్రాంత ఉద్యోగులు ఈ శిబిరానికి విచ్చేసి ఉక్కు కార్మికులకు సంఘీభావాన్ని తెలిపి దీక్షల్లో కూర్చున్నారు. పూర్తి సామర్థ్యంతో స్టీల్‌ప్లాంటును నడిపేందుకు కేంద్రంపై కూటమి ప్రభుత్వం ఒత్తిడి తేవాలని వారు కోరారు. పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని మూసివేయాలనే కుట్రతోనే లాభాల్లో ఉన్న సంస్థను నష్టాల బాట పట్టిస్తుందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని లేదా సెయిల్‌లో విలీనం చేస్తామన్న ప్రకటన వచ్చేంత వరకూ తాము పోరాటాలను కొనసాగిస్తామన్నారు.

జీతాలు చెల్లించకపోతే పనులు నిలిపివేస్తాం

పారిశుధ్య కార్మికుల హెచ్చరిక

మల్కాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సకాలంలో తమకు జీతాలు చెల్లించకపోవడం అన్యాయమని జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమకు జీతాలు చెల్లించకపోతే పారిశుధ్య పనులను నిలిపివేస్తామని హెచ్చరించారు. మంగళవారం ఉదయం 40, 58 నుంచి 63 వార్డులకు చెందిన ప్యాకేజీ కార్మికులు శ్రీహరిపురంలోని వార్డు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.రమణ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ వచ్చినా జీతాలు చెల్లించకపోవడంతో పారిశుధ్య కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. వారు పని చేయడానికి సరైన పనిముట్లు కూడా లేవని వాపోయారు. సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు డి.రాము, రాంబాబు, సూరిబాబు, తిరుపతిరావు, రైలుబాబు, డి.రాజు, దేవి, దుర్గా, పాప, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో నిరసన

గాజువాక: సకాలంలో జీతాలు చెల్లించకుండా జాప్యం చేస్తుండడం పట్ల మంగళవారం గాజువాకలో పారిశుధ్య కార్మికులు నిరసన చేపట్టారు. విధులకు గంట ఆలస్యంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో ఇంటి అద్దెలు కూడా చెల్లించలేకపోతున్నామని, కిరాణా షాపులకు డబ్బులు ఇవ్వలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు గొలగాని అప్పారావు, రాము, గణేశ్, సత్యవతి, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుతోనే భవిష్యత్తుకు భద్రత

గాజువాక, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపుతోనే భవిష్యత్తుకు భద్రత లభిస్తుందని ఈపీడీసీఎల్ డీఈఈ ఎ.పార్థసారథి అన్నారు. గాజువాక హైస్కూల్‌లో మంగళవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన పరిరక్షణ-విద్యుత్ ఆదాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈలు ఆర్‌వి రామకృష్ణ, కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన అందరి బాధ్యత

పెదగంట్యాడ, డిసెంబరు 1 7(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన అందరి బాధ్యత అని, వీధుల్లో వ్యర్థాలు సేకరించి కాలం గడుపుతున్న మహిళలకు చేయూతనివ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం గిరిజా కాలనీలో వ్యర్థాలు సేకరించే వారి (వేస్ట్‌పికర్స్) కోసం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇలాంటి వారికి ప్రభుత్వం, స్థానిక సంస్థలు అండగా నిలవాలన్నారు. గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి మాట్లాడుతూ మురికివాడల్లో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి, అటువంటి మహిళలను గుర్తించి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు 30 మంది మహిళలను గుర్తించి వారు వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా వారికి పలు సామగ్రి అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ నిఖిల, కమ్యూనిటీ మొబలైజర్ ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి హానికరం'

అగనంపూడి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి హానికరమని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి మంగళవారం స్థానికంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్లాసిక్ వాడకం వల్ల క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, సింగిడి సింహాచలం, రుద్రకుమార్, నారాయణరావు, నరసింగరావు, రేవతి, హరిత, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారుల కోసం ఆట స్థలం సిద్ధం

పెదగంట్యాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి ప్రియదర్శనీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన ఆటస్థలాన్ని గ్రేటర్ సిబ్బంది మంగళవారం శుభ్రం చేశారు. ఇక్కడ పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగించి పిల్లలు ఆడుకునేందుకు వీలుగా తీర్చిదిద్దారు. కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు దగ్గరుండి ఈ పనులు చేయించారు.

ప్లాస్టిక్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఎంహెచ్‌వో సునీల్

అక్కయ్యపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించడం వల్ల ఎన్నో అనర్థాలు సంభవిస్తాయని, అందుకోసం గుడ్డ సంచులను మాత్రమే వాడాలని జీవీఎంసీ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్ వినియోగదారులకు తెలిపారు. గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్‌లోని రైతుబజారులో మంగళవారం ఒక్కసారి మాత్రమే వినియోగించి పడవేసే ప్లాస్టిక్‌పై వినియోగదారులకు, రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్‌ను విడనాడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, రైతుబజారు ఈవో పి.చిన్నబాబు, పారిశుధ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది ప్రభుత్వ సెలవులు ఇవే

అక్కయ్యపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల (జాతీయ పండగ, ఇతర సెలవులు) చట్టం 1988, ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీలు, సంస్థల చట్టం 1974 కింద విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని వివిధ సంస్థలు, ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులకు 2025 సంవత్సరానికి వేతనంతో కూడిన సెలవు దినాలను నిర్ణయించినట్టు కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎం.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 15న కనుమ, 26న రిపబ్లిక్ డే, ఫిబ్రవరి 26న మహాశివరాత్రి, మార్చి 31న రంజాన్, మే 1న కార్మిక దినోత్సవం, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, అక్టోబరు 2న గాంధీ జయంతి, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం, డిసెంబరు 25న క్రిస్మస్ సెలవులు ఉంటాయని తెలిపారు.

జాకీర్ హుస్సేన్ మృతికి ఫిల్మ్ సొసైటీ సంతాపం

సీతమ్మధార, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం గర్వించదగ్గ తబలా వాయిద్యకారుడు జాకీర్ హుస్సేన్ అమెరికాలో చికిత్స పొందుతూ మరణించడం పట్ల వైజాగ్ ఫిల్మ్ సొసైటీ తీవ్ర సంతాపం తెలిపింది. తబలా అనే వాయిద్య పరికరానికి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చిన భారతీయ కళకారుడు హుస్సేన్ అని సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు కొనియాడారు. తబలా అనేది ఒక సహాయక వాయిద్య పరికరం. దానిని ఒక స్వతంత్ర వాయిద్యంగా మలచి కచేరీలు ఇచ్చిన సృజనాత్మక కళాకారుడు హుస్సేన్ మృతికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సంతాపం తెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

అభాగ్యులకు ప్రగడ ట్రస్ట్ మధ్యాహ్న భోజనం

అక్కయ్యపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రగడ కుటుంబం పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా నిరుపేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రగడ చారిటబుల్ ట్రస్ట్ ఆవిర్భవించిందని చైర్మన్ ప్రగడ జగన్నాథరావు తెలిపారు. టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ, జీవీఎంసీ సంయుక్తంగా నిర్వహిస్తోన్న నిరాశ్రయ వసతిగృహాల్లో 85 మంది అభాగ్యులకు మంగళవారం భోజనం ఏర్పాటు చేశామన్నారు. అభాగ్యులకు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ట్రస్ట్ కోశాధికారి ప్రగడ చక్రరావు, శేషు, ఆకాశబాబు, పార్వతి పాల్గొన్నారు.

73 చోరీ కేసుల్లో 87 మంది అరెస్టు

... 5వ పేజీ తరువాయి

చేశామన్నారు. నేరాల నియంత్రణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు వీలుగా 142 కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వీటన్నింటి కారణంగానే చోరీ జరిగిన వెంటనే రికవరీ చేయగలుగుతున్నామన్నారు. అనంతరం రికవరీ చేసిన సొత్తును బాధితులకు సీపీ స్వయంగా అందజేశారు. కోర్టు చుట్టూ తిరిగే పని లేకుండా రికవరీ చేసిన వెంటనే సొత్తుని తమకు అందజేయడం ఆనందంగా ఉందని బాధితులు సంతోషం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ లతామాధురి, క్రైమ్ ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ ఎ.వెంకటరావు పాల్గొన్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

... 5వ పేజీ తరువాయి

నందిబొమ్మ వద్ద మరొకరు జీ+2కు అనుమతులు పొంది సెట్ బ్యాక్స్ విడిచిపెట్టకుండా జీ+3 నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాల విషయంపై జోన్-3 ఏసీపీ మధుసూదనరావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జాయ్ జమీమియా కేసులో రాజకీయ నేతల పాత్రపై విచారణ

... 5వ పేజీ తరువాయి

మారిందన్నారు. బాధితులు తమ పరువు పోతుందనే భయంతో బయటకు రావడం లేదని, కనీసం పది మంది వరకూ బాధితులు ఉండవచ్చునని సీపీ అభిప్రాయపడ్డారు. జాయ్ జమీమియా గ్యాంగ్‌లో బీజేపీకి చెందిన నాయకుడు పాత్ర ఉన్నట్టు తమ దృష్టికి రాలేదన్నారు. ఆ పార్టీ కూడా ఇప్పటికే ఒకరిపై ఆరోపణలు వస్తున్నాయని, ఆ వ్యక్తికి పార్టీకి సబంధం లేదని ప్రకటన ఇచ్చిందని సీపీ గుర్తుచేశారు.

బస్టాప్‌లో కూరగాయల దుకాణం!



కళింగనగర్ ఆర్టీసీ బస్టాపు ఇది...

మురళీనగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బస్టాప్‌లు వ్యాపారానికి నిలయంగా మారుతున్నాయి. మాధవధార, కైలాసపురం, ఆర్అండ్‌బీ జంక్షన్‌లలో వ్యాపారాలు చేస్తున్న వారు ప్రయాణికులు నిల్చోడానికి కూడా జాగా ఇవ్వడం లేదు. ఈ ప్రాంతాల్లో బస్ షెల్టర్లు నిర్మించకపోవడం ఈ సమస్యకు కారణం. దీంతో ఏది బస్టాపో అన్న చందంగా మారింది. ఈ ఏడాది ఆరంభంలో 48వ బస్సు రూట్‌లో రూ.9 కోట్లు వెచ్చించి తారురోడ్లు కొంతవరకు నవీకరించారు. ఏ ఒక్క చోటా కొత్త బస్టాప్ ఏర్పాటు చేయలేదు. 48ఎ, 48 ఎస్ నంబర్లతో రెండే సిటీ బస్సులు తిరిగే దారిలో బస్టాపులు ఎందుకు అనుకున్నారో? ఏమో..! జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం గానీ, స్థానిక ప్రజాప్రతినిధులు గానీ చర్యలు తీసుకోలేదు. దీంతో పాత బస్టాపుల్లో దాతలు ఏర్పాటు చేసిన షెల్టర్లే ఈ రూట్‌లో దిక్కుగా మారాయి. అవి కూడా చాలా చోట్ల లేవు. దీంతో మాధవధార కళింగనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, మురళీనగర్ లాంటి ప్రాంతాలు సహా కైలాసపురం, మధుసూదననగర్ లాంటి చోట్ల రోడ్ల పైనే ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కోసం పడిగాపులు పడుతున్నారు. ఉన్న ఆ జాగాల్లో కూడా తోపుడుబళ్లు, నేల మీద కూరగాయలు పోసి అమ్మకాలు సాగిస్తున్న వారితో బస్సులెక్కే వారికి చోటే ఉండటం లేదు!

మానవత్వం చాటుకున్న పోలీసులు

- సామాజిక మాధ్యమం ద్వారా దంపతులను కలిపి..
- అతిథి మర్యాదలతో సాగనంపి..



గురుమ్‌ను అతని భార్యకు అప్పగిస్తున్న పోలీసు బృందం

జగదాంబ కూడలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీసుల్లో మానవత్వం ఉందని చాటిచెప్పిన ఉదంతం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీస్‌స్టేషన్‌లోనే ఓ జంటకు అతిథ్యమిచ్చి, వారి స్వస్థలం బెంగళూరుకు రైలులో సాగనంపారు. తన భర్త ఇక లేరనుకున్న భార్య కళ్లలో ఆనందం తొణికిసలాడింది. మతిస్థిమితం లేని, భాష తెలియక రోడ్డుపై అనాథలా సంచరిస్తున్న విక్రమ్ గురుమ్‌ను వన్‌టౌన్ పోలీసులు అతని భార్య రింకుకు అప్పగించారు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ దేముడుబాబు తెలిపిన వివరాలివి.. డార్జిలింగ్ నుంచి రైలులో బెంగళూరు వెళ్తున్న విక్రమ్ గురుమ్ (36) ఈ నెల 9న విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో దిగారు. కొద్దిసేపు అలా బయటకు వెళ్లి రావాలనుకుని ప్రమాదం బారినపడడంతో కొందరు కేజీహెచ్‌కు తరలించారు. ఈలోగా వారి రైలు బయలుదేరింది. కేజీహెచ్‌లో చికిత్స తీసుకున్న విక్రమ్ గురుమ్‌కు మతిస్థిమితం సరిగా లేక ఆసుపత్రి నుంచి బయటకు వచ్చేశారు. సదరు వ్యక్తి కొద్ది రోజులుగా టౌన్ కొత్త రోడ్డు ప్రాంతంలో రోడ్లపైన, ఫుట్‌పాత్‌ల మీద తిరుగుతుండడాన్ని పోలీసులు గమనించారు. ఆ వ్యక్తిని ఆరా తీయగా హిందీలో మాట్లాడడాన్ని గుర్తించారు. దీంతో పి.నానాజీ అనే కానిస్టేబుల్ వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో బెంగళూరులో ఉంటున్న అతని భార్య రింకు సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించారు. కొత్త రోడ్డులో ఉన్న విక్రమ్ గురుమ్‌ను వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి ప్రశ్నించగా భార్య రింకు సెల్‌ఫోన్ నెంబరు తెలిపారు. బెంగళూరు నుంచి పోలీస్‌స్టేషన్‌కు చేసిన ఫోను నెంబరు ఒకటే కావడంతో అతని భార్య రింకుకు విషయం తెలిపారు. మంగళవారం బెంగళూరు నుంచి విక్రమ్ గురుమ్ భార్య రింకు, బావ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పోలీస్ స్టేషన్‌లో వారికి భోజన సదుపాయం కల్పించి ముగ్గురినీ బెంగళూరుకు రైలులో పంపారు. తమకు సాయం చేసిన పోలీస్ కమిషనర్‌కు, వన్‌టౌన్ పోలీసులకు రింకు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

కల్వర్టుల మరమ్మతులకు చర్యలు: జోనల్ కమిషనర్



సీతంపేట బీటీఆర్ కాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ శివప్రసాద్

సీతంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 25వ వార్డు పరిధి సీతంపేట, రాజేంద్రనగర్, రెల్లి వీధి, బీటీఆర్ కాలనీలో పారిశుధ్యం, కాలువలు, కల్వర్టుల పరిస్థితులను పరిశీలించేందుకు జీవీఎంసీ జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్ మంగళవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పర్యవేక్షణలో వార్డులో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో పరిశీలించడంతో పాటు కొన్ని కల్వర్టులు దెబ్బతిన్నట్లు గుర్తించారు. తక్షణమే వాటిని బాగుచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జోనల్ కమిషనర్ శివ ప్రసాద్ తెలిపారు. సులభ్ కాంప్లెక్సుల స్థితిగతులు, నిర్వహణ తీరును పరిశీలించారు. టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు సానుకూల స్పందన



రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గౌడ సంఘం నేతలు



మహారాణిపేట తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

మహారాణిపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందని, అర్జీలను పరిష్కరించడం ద్వారా కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఆశిస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం వచ్చిన మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మంగళవారం జిల్లా గౌడ సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హోటల్ నోవాటెల్‌లో రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శి వీరంకి రంగారావు ఆధ్వర్యంలో నాయకులు ఆయనతో సమావేశమై తమ సమస్యలను విన్నవించిన సందర్భంగా మంత్రి వారితో సంభాషిస్తూ రెవెన్యూ సదస్సుల వల్ల ప్రయోజనాలను వివరించారు. గౌడ సంఘం నేతలు మార్గన రామారావు, తాతా కృష్ణారావు, కామన వెంకట సుబ్బారావు, జెర్రిపోతుల ప్రసాద్, శీదివి నారాయణరావు, మట్టా ఆనందరావు, పరసా నాగరాజు, చలమోలు శ్రీనివాసరావు, వై.భవాని, పి.దుర్గాప్రసాద్ రాచమళ్ల పుష్పలత, బరగా భరత్‌లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సదస్సుల ద్వారా సత్వర పరిష్కారం

అల్లిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని, ప్రజలు వినియోగించుకోవాలని మహారాణిపేట తహసీల్దార్ ఎస్.ఎం.జిలాని సూచించారు. మంగళవారం అల్లిపురానికి సంబంధించి రెవెన్యూ సదస్సును వెంకటేశ్వర మెట్ట సచివాలయం వద్ద నిర్వహించారు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సర్వే నెం 1450, 1261 భూ సమస్యపై హౌస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్లు భీశెట్టి వసంతలక్ష్మి, కందుల నాగరాజు, టీడీపీ నాయకుడు విల్లూరి చక్రవర్తి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

కేజీహెచ్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఇతర ప్రముఖులు, నర్సింగ్ సిబ్బంది

మహారాణిపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా వేడుకలు ప్రారంభమైన నేపథ్యంలో కేజీహెచ్‌లోనూ ఏర్పాట్లు చేశారు. నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు టి.గంగాభవానీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో తొలుత కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌తో కేకు కోయించారు. ఆయన ద్వారా పేదలకు దుప్పట్లు, క్రిస్మస్ బహుమతులు పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవోలు డాక్టర్ మెహర్, డాక్టర్ ధవళ భాస్కర్, ఎ.డి. పి.ఎస్.అప్పారావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పన, సంఘ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాలల జీవితాల్లో పరివర్తనకు యత్నం

మహారాణిపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలలకు క్రీడా శిక్షణ అందిస్తూ సాధికారతకు ప్రయత్నిస్తున్నామని ఇండియన్ ఆయిల్ సంస్థ ప్రతినిధి సాహ్ని తెలిపారు. 'బాలల జీవితాలలో మార్పు' అనే అంశంపై మహారాణిపేట గోకుల్‌పార్కు వద్ద జరిగిన సమావేశంలో ఆజాద్‌కా మహోత్సవ్ పేరుతో పరివర్తన కార్యక్రమంలో భాగంగా ప్రిజన్ టు ఫ్రైడ్ కార్యక్రమం ప్రారంభించామని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమంలో (సీఎస్ఆర్) భాగంగా అట్టడుగు వర్గాల వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పర్యవేక్షక గృహంలోని బాలలకు పది క్రీడాంశాల్లో తర్ఫీదు ఇస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. కోచింగ్ సౌకర్యాలు కల్పిస్తూ, క్రీడా పరికరాల కిట్లు అందించనున్నామని పేర్కొన్నారు.

'శారద పోరాటాలు స్ఫూర్తిదాయకం'



సిటు కార్యాలయంలో శారద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జగదాంబ కూడలి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతో కార్మికులకు అండగా నిలబడడమే శారదకు నిజమైన నివాళులంటూ సిటు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం సిటు కార్యాలయంలో ఉద్యమకారిణి డి.శారద 20 వ వర్ధంతిని పురస్కరించుకొని నాయకులు ఆమెకు నివాళులర్పించారు. కార్మికులకు అండగా నిలుస్తూ శారద చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. శ్రామిక మహిళల కోసం ఆమె జరిపిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కుమార్, వై.రాజు, జ్యోతిరావు, పోలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు పనిచేద్దాం: పద్మ

కంచరపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా శ్రామిక మహిళా ఉద్యమ నిర్మాత డి.శారద వర్ధంతి సందర్భంగా కంచరపాలెం బీఎస్ఆర్ భవనంలో ఐద్వా మహిళలు ఘన నివాళులర్పించారు. శారద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ మాట్లాడుతూ జిల్లాలో మహిళా, శ్రామిక ఉద్యమాల నిర్మాణంలో శారద కీలక పాత్ర పోషించారన్నారు. శారద స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ఆమె ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకురాలు బొట్టా ఈశ్వరమ్మ, ఆర్.భవానీ, కె.హేమలత, కమల, సావిత్రి పాల్గొన్నారు.

రాజకుమారికి ఘననివాళి

అల్లిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా సమాఖ్య ఉద్యమ నాయకురాలు చంద్రకుమారి 6వ వర్ధంతిని పురస్కరించుకుని విశాఖ జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అల్లిపురంలోని నీలం రాజశేఖరరెడ్డి భవనంలో ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఆమె పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వనజాక్షి, కార్యదర్శి ఎంఏ బేగం, దేవుడమ్మ, అన్నపూర్ణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు ఏకరువు

... 5వ పేజీ తరువాయి

ఎలాగని సిసోడియాను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. 388 జీవో ప్రకారం ఆక్రమణలకు పాల్పడిన ఏడు వేల మందికి రెగ్యులర్ చేశామని అధికారులు చెబుతున్నారని, కానీ, గత ప్రభుత్వం నాలుగు వేల మందికి మాత్రమే చేసిందన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏకు లేఖ రాసినా స్పందన లేదన్నారు. రూపాయి ఖర్చు లేని పనులను కూడా తాత్సారం చేస్తున్నారన్నారు. 'మంచి ప్రభుత్వమని మనం చెప్పుకోవడం కాదు. ప్రజలు చెప్పుకోవాలంటే సరిగా పనిచేయాలి' అని వెలగపూడి స్పష్టంచేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నగర పరిధిలోని కీలకమైన ప్రాంతాల్లో ఉన్న సీబీసీఎన్‌సీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. దేవదాయ శాఖకు చెందిన భూములను 22లో పెట్టి ఆక్రమణలకు గురికాకుండా కాపాడుతున్నామని, మరి క్రిస్టియన్ మిషనరీలకు చెందిన భూములను అందులో చేర్చి ఎందుకు పరిరక్షించకూడదని పల్లా ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల కోట్ల రూపాయల విలువైన క్రిస్టియన్ ల్యాండ్స్ ఉన్నాయని, వాటిని పరిరక్షించాలంటే 22-ఏ జాబితాలో చేర్చడం ఒక్కటే మార్గమన్నారు. దసపల్లా భూములపై తాము ప్రతిపక్షంలో ఉండగా పోరాటం చేశామని, ప్రభుత్వ భూములను రక్షిస్తామని చెప్పామన్నారు. అక్కడ నిర్మాణాలు జరిగితే తామేం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దసపల్లా భూములపై సరైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంటుకు సంబంధించి సరిహద్దు వివాదాలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి అనగాని మాట్లాడుతూ క్రిస్టియన్ భూములను 22ఏలో చేర్చడంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ 22-ఏలో ప్రభుత్వ భూములతోపాటు ప్రైవేటు భూములు చేరాయన్నారు. ఇరవై ఏళ్లుగా లేనిది ఇప్పుడు తన ఇంటి స్థలం 22-ఏలో చేరిందని, దానివల్ల రుణం తీసుకోవడానికి ఇబ్బంది అవుతోందని, తనలాంటి ఎంతోమంది ఇటువంటి ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్య అన్నిచోట్ల ఉందని, దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి సమాధానం ఇచ్చారు.

ఇదే సమస్యపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ కలెక్టర్లు ఎన్‌వోసీ ఇచ్చి మళ్లీ 22ఏలో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. రాజకీయ బాధితులు (పొలిటికల్ సఫరర్స్), ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఇచ్చిన భూములను 22ఏలో చేర్చడంపై ఆయన తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తంచేశారు. వీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టినట్టు మంత్రి సమాధానమిచ్చారు. టీడీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని డీఎంఎస్ పురం గ్రామాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించడం లేదని, ఈ గ్రామానికి సంబంధించి భూ వివాదాలు ఉన్నాయని, రీ సర్వే జరిపి రైతులకు మేలు చేయాలన్నారు. రీ సర్వేను రీ డిజైన్ చేస్తున్నామని, కొద్దిరోజుల్లోనే ప్రక్రియను ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు నేరుగా వెళ్లి చర్యలు తీసుకుంటున్నారని, స్థానికంగా ఉంటున్న తమకు కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ మారలేదన్న ఉద్దేశంతో ఒక నాయకుడికి చెందిన భూములను 22ఏలో చేర్చారని, రాజకీయ కక్ష సాధింపునకు 22ఏను మార్చుకున్నారని, దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలకు భూసేకరణలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని, కొందరు నాయకులు రూ.కోట్లు గడించారన్నారు. కొందరు బోగస్ వ్యక్తులు లబ్ధిదారులుగా చేరారని పేర్కొన్నారు. ఈ ఇళ్ల పట్టాలను పదేళ్లపాటు అమ్మకూడదని, కానీ, 60 శాతం విక్రయాలు జరిగిపోయాయన్నారు. దీనిపై స్పందించిన మంత్రి అనగాని 22ఏలో తప్పులు జరిగాయని, దానిపై విచారణ జరిపిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జగనన్న ఇళ్ల లబ్ధిదారుల్లో ఏడు లక్షల మంది బోగస్‌గా గుర్తించామన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ తాడి గ్రామం తరలింపు ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలు జారీచేస్తామని మంత్రి స్పష్టంచేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గం పరిధిలో 2.08 ఎకరాలు భూమి ఉందని, దానిని పరిరక్షించుకోవాలన్నారు. కొందరు జర్నలిస్టుల పేర్లతో ఫిర్యాదులు చేసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని, అటువంటి ఫిర్యాదులపై అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. సనపల సీతారామ్ అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై ఉన్న గ్రీన్‌బెల్టును ఆక్రమించి మరీ మాల్‌లోకి వెళ్లేందుకు నాలుగు ఎంట్రీలు, ఎగ్జిట్ పాయింట్స్ పెట్టారని, ప్రశ్నిస్తే జాతీయ రహదారుల శాఖ అధికారులు అనుమతి ఇచ్చారని చెబుతున్నారన్నారు. అనుమతులు ఇచ్చుకుంటూ పోతే గ్రీన్ బెల్ట్ ఉండదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దానిపై ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేస్తామని, ఇటువంటి వాటిని ఉపేక్షించబోమని మంత్రి స్పష్టం చేశారు.

భీమిలి బిల్డింగ్ సొసైటీ సమస్యను పరిష్కరించాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ కోరారు. దాదాపు రెండు వేల కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. గరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో తిమ్మాపురంలోని హేచరీస్ వల్ల చుట్టుపక్కల ప్రజలకు సమస్యలు ఎదురవుతున్నాయని, వెంటనే ఖాళీ చేయించి మరో చోట స్థలం కేటాయించాలన్నారు.

మహా నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

స్పేస్ అని అందులో ప్లాన్ ఇవ్వకూడదంటూ జీవీఎంసీకి ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ప్లాన్ దరఖాస్తును తిరస్కరించారు. దాంతో సదరు వ్యక్తి హైకోర్టులో కేసు వేయగా...జీవీఎంసీ అధికారులు కూడా అది ఓపెన్ స్పేస్ స్థలమని పేర్కొంటూ మరో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో రెండు కేసులు హైకోర్టులో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి.

ఇదిలావుండగా రెండు నెలల కిందట అదే వ్యక్తి ఆ స్థలంలో భవన నిర్మాణం కోసం మరోమారు జీవీఎంసీకి దరఖాస్తు చేశారు. అక్కడితో ఆగకుండా ఆ స్థలానికి ఉన్న ప్రహరీ గోడను కూల్చేసి, చెత్తచెదారాలను తొలగించేసి, చదును చేశారు. స్థలాన్ని తన ఆధీనంలోకి తీసుకున్నారు. కేసు కోర్టులో ఉండగా స్థలంలోకి ప్రవేశించడం, అక్కడ ప్రహరీని ధ్వంసం చేయడం, కంటెయినర్‌ను ఏర్పాటు చేయడాన్ని దీనిపై జీవీఎంసీ అధికారులు అడ్డుకోవాల్సింది పోయి...తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

ఈ నేపథ్యంలో ఓపెన్ స్పేస్‌లో భవన నిర్మాణం కోసం ప్రైవేటు వ్యక్తి మరోసారి ప్లాన్‌కు దరఖాస్తు చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ కార్పొరేటర్ భర్త సీతారామరాజు ఇటీవల మరోసారి జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

రూ.16 కోట్ల విలువైన స్థలం అన్యాక్రాంతం

జీవీఎంసీ అధికారుల తీరుతో రూ.16 కోట్లు విలువైన స్థలం అన్యాక్రాంతమైపోతుందని ఫిర్యాదుదారుడు జీవీఎంసీ అధికారుల వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. నగరంలో డైమండ్ పార్కు ఏరియా అంటేనే పూర్తిగా వాణిజ్య ప్రాంతంగా గుర్తింపు ఉంది. అన్నిరకాల దుకాణాలు, షాపింగ్‌కాంప్లెక్స్‌లు, ఎలక్ట్రికల్ షోరూమ్‌లు ఉండడంతో అక్కడ భూమికి చాలా డిమాండ్ ఉంది. గజం ధర రూ.రెండు లక్షల వరకూ పలుకుంది. అలాంటిచోట 818 గజాలు స్థలాన్ని పరిరక్షించడంలో జీవీఎంసీ అధికారులు ఎందుచేతనో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయం టౌన్‌ప్లానింగ్ విభాగంలోని ఒక అధికారి వద్ద ప్రస్తావించగా, ఆ స్థలం లేఅవుట్‌లోని ఓపెన్‌స్పేస్‌గానే తమ రికార్డులో ఉందని, కానీ ప్రైవేటు వ్యక్తి మాత్రం తాను సొసైటీ నుంచి కొనుగోలుచేశామని, దానికి సంబంధించిన పత్రాలన్నీ ఉన్నాయంటూ వాదిస్తున్నారన్నారు. జీవీఎంసీకి కూడా ఆ స్థలం ఓపెన్‌స్పేస్‌గానే పేర్కొంటూ కోర్టులో కేసు వేసిందన్నారు. దీనిపై హైకోర్టులో రెండు కేసులు పెండింగ్‌లో ఉండడంతో అక్కడ నుంచి స్పష్టత వస్తేనేగానీ ప్లాన్ జారీ చేయలేమంటూ దరఖాస్తును తిరస్కరించామన్నారు.

ఆర్ఈసీఎస్‌పై విచారణ

... 5వ పేజీ తరువాయి

ప్రయత్నాలు మొదలెట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలో ఆర్ఈసీఎస్ విషయాలు ప్రస్తావించి, తగిన న్యాయం చేయాలని కోరగా, మంత్రి అచ్చెన్నాయుడు 51-ఏ విచారణ చేయిస్తామని ప్రకటించారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్‌ను ఆర్ఈసీఎస్‌కు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. సహకార సంస్థ నుంచి తగిన సమాచారం అడిగితే సరైన స్పందన ఉండడం లేదని కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆరు నెలల పాటు ఇన్‌చార్జిగా ఉండాలని ఆదేశాల్లో స్పష్టంచేశారు.

డిపాజిట్లు గల్లంతు

అనకాపల్లి ఆర్ఈసీఎస్ సహకార సంస్థగా నడిపినప్పుడు ప్రతి ఏటా ఆడిటర్ ద్వారా ఆర్థిక వ్యవహారాల లెక్కలు సమర్పించేవారు. ఆ గణాంకాల ప్రకారం 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.41.09 కోట్ల డిపాజిట్లు బ్యాంకుల్లో ఉన్నాయని వెల్లడించారు. 2016-17లో రూ.42.86 కోట్లు చూపించారు. 2107-18లో రూ.40.03 కోట్లు ఉన్నాయని ప్రకటించారు. 2018-19లో ఆకస్మికంగా ఆ మొత్తం రూ.19.15 కోట్లకు తగ్గించి చూపించారు. 2020-21న సమర్పించిన ఆడిట్ రిపోర్టులో మొత్తం అన్ని డిపాజిట్లు కలిపి రూ.196.23 కోట్లు ఉన్నాయని తెలిపారు. అందులో వాటా మూలధనం, ప్రత్యేక రిజర్వులు, చట్టబద్ధ రిజర్వులు ఉన్నాయని ఆడిటర్ ఏవీఆర్ అండ్ కో నివేదిక సమర్పించింది. అయితే ఈఆర్‌సీ ఆదేశం మేరకు సంస్థను ఈపీడీసీఎల్‌కు అప్పగించినప్పుడు తమ దగ్గర ఎటువంటి డిపాజిట్లు లేవని అప్పటి అధికారులు చేతులెత్తేశారు. నామమాత్రపు నిల్వలు కలిగిన బ్యాంకు ఖాతాలను మాత్రమే అప్పగించారు. ఈ సందర్భంగా వారు నిధుల జమకు, ఖర్చులకు వేర్వేరు బ్యాంకు ఖాతాలు ఉపయోగించారనే విషయం బయటకు వచ్చింది. ఈపీడీసీఎల్ స్వాధీనం చేసుకున్న తరువాత వినియోగదారులకు సేవలు అందించడంపైనే దృష్టిపెట్టింది. గతంలో జరిగిన ఆర్థిక లావాదేవీల జోలికి వెళ్లకుండా గత వైసీపీ ప్రభుత్వం కట్టడి చేసింది. అప్పట్లో వైసీపీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి ఆర్ఈసీఎస్‌ను నచ్చినట్టు ఉపయోగించుకున్నారు. ఆ ప్రభుత్వంలోనే ఈపీడీసీఎల్ నుంచి మళ్లీ వెనక్కి తేవాలని యత్నించి విఫలమయ్యారు. ఇప్పుడైనా ఆర్ఈసీఎస్ ఆర్థిక వ్యవహారాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, కోట్లాది రూపాయలు దిగమింగిన వారి నుంచి రికవరీ చేయాలని అనకాపల్లి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సంక్షిప్తంగా..

ద్రోణంరాజు సత్యనారాయణ జయంతి రేపు



సిరిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : దివంగత ద్రోణంరాజు సత్యనారాయణ 92వ జయంతి వేడుకలను సిరిపురం ద్రోణంరాజు సర్కిల్ వద్ద ఈ నెల19న ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఆయన మనమడు ద్రోణంరాజు శ్రీవత్సవ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, శాసన మండలి సభ్యులు, నగర మేయర్ , మాజీ శాసన సభ్యులు, అభిమానులు హాజరవుతారని తెలియజేశారు. పెద్ద ఎత్తున అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

సైనిక కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న డైరెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా అధికారి సత్యానందం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వివిధ సంఘటనల్లో మృతి చెందిన సైనిక కుటుంబాలకు జిల్లా సైనిక సంక్షేమ విభాగం ఆర్థిక సాయాన్ని అందించింది. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని ఎనిమిది కుటుంబాలకు రూ.50 వేలు చొప్పున సాయాన్ని అందించామని జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం తెలిపారు. సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి చేతుల మీదుగా ఈ సాయాన్ని అందచేశారు.

రెవెన్యూ మంత్రిని కలిసిన ప్రణవ్ గోపాల్



మంత్రి సత్యప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్

సిరిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం విశాఖ పర్యటనలో ఉన్న మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి పలు విషయాలపై చర్చించారు.

షర్మిల జన్మదిన వేడుకలు

ఆరిలోవ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడులకు మంగళవారం సంజయ్‌గాంధీ కాలనీలో యూత్ కాంగ్రెస్ నేత దేవర వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త ప్రియాంక దండి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువులు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 43, టమాటా 17, వంకాయలు (తెలుపు) 34,వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 42, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 28, క్యారెట్ 50 దొండకాయలు 40, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది)56, బరబాటి 40, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 28 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, పొటల్స్ 48, కీరదోస 36, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

ఫుట్‌పాత్‌లను వాడేస్తున్నారు

» ఆక్రమణలకు గురువుతున్న రోడ్డు పక్కన ఫ్లాట్‌ఫాంలు
» పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

వెంకోజీపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అన్ని మార్గాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో జీవీఎంసీ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రధాన మార్గాల్లో రోడుకు ఇరువైపులా కాలువలను నిర్మించి, వాటిపై మోడ్రన్‌గా ఫుట్‌పాత్‌లను నిర్మించారు. ఈ క్రమంలో రోడ్డు పక్కనున్న చిన్న తరహా వ్యాపారాలైన కిరణా బడ్డీలు, మెకానిక్‌లు, మాంసం దుకాణాలు, టీ స్టాల్స్ వంటివి తొలగించారు. దీంతో కొందరు ఉపాధి కోల్పోయారు. అయినప్పటికీ ఈ ప్రాంతంలో వీధులు సుందరీకరణ అవుతాయని అందరూ భావించారు. కానీ, జరిగింది వేరు.

జీవీఎంసీ 15వ వార్డులోని ఎంఎంటీసీ కాలనీ ప్రాంతంలో నిర్మించిన మోడ్రన్ ఫుట్‌పాత్‌లపై ఈసారి కాస్త పెద్ద స్థాయి వ్యాపారాలు ఏర్పాటయ్యాయి. ఈ విషయంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఏం చేస్తున్నారో అర్థవం కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు మోడ్రన్‌గా నిర్మించి ఫుట్‌పాత్‌లపై ఆయా ప్రాంతాల్లో భవన నిర్మాణాలు చేపట్టేవారు నిర్మాన సామగ్రి వేస్తున్నారు. ఎల్‌ఐసీ అపార్టుమెంటుల వద్ద ప్రధాన మార్గంలో నిర్మాణమతున్న బహుళ అంతస్థులకు సంబంధించిన నిర్మాణ సామగ్రిని ఈ ఫుట్‌పాత్‌పైనే ఉంచారు. దీనికి పక్కనే గత శనివారం ప్రారంభమైన ఓ టిఫిన్ సెంటర్ కౌంటర్‌ను కూడా ఈ నిర్మాణ సామగ్రికి తోడుగా ఫుట్‌పాత్‌పైనే పెట్టారు. మరి, ఫుట్‌పాత్ ఆక్రమణలపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోరా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చిరువ్యాపారులపై మాత్రం ఝులుం చూపించే టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందికి ఇవి మాత్రం కనిపించడం లేదా అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వలన పాదచారులు రోడ్డుపైనే నడుస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. నగరంలో వార్డుకు సుమారు 6 సచివాలయాలు కూడా ఉన్నాయని, అక్కడున్న టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పందించకుంటే ఎలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఫుట్‌పాత్ ఆక్రమణలను అరికట్టాలని కోరుతున్నారు.



25వ వార్డులో ఫుట్‌పాత్‌పై వేసిన నిర్మాణ సామగ్రి, ఏర్పాటు చేసిన హోటల్ బోర్డులు

వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఏయూకు స్థానం

» మొదటి 35 శాతం వర్సిటీలో చోటు
» స్టడీ అబ్రాడ్ ఎయిడ్ సంస్థ వెల్లడి

వెంకోజీపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను ఆధారం చేసుకుని స్టడీ అబ్రాడ్ ఎయిడ్ సంస్థ అందించిన వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2025లో ఏయూ మెరుగైన స్థానాన్ని సాధించింది. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ 35 శాతం వర్సిటీలో ఒకటిగా ఏయూ నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా 8536 విద్యా సంస్థలను పరిశీలించి.. వీటిలో టాప్ 35 శాతం ఎంపిక చేసింది. ఇందులో ఏయూ స్థానం సాధించింది.

ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావుకు మంగళవారం అధికారికంగా అబ్రాడ్ ఎయిడ్ సంస్థ పంపింది. ఏయూలో 64 దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఈ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థుల సంఖ్య ఎనిమిది శాతం వరకు ఉంది.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆనందపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ కోరారు. మండలంలోని శొంఠ్యాం గ్రామంలో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ భూసమస్యలకు సంబంధించిన పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విలేజ్ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది ఈ రెవెన్యూ సదస్సులలో పాల్గొంటున్నందున రేషన్ కార్డుల్లో పేర్ల మార్పుచేర్పులు, జనన, మరణ ధ్రువపత్రాలకు సంబంధించిన దరఖాస్తులకు వెంటనే పరిష్కారం చూపడం జరుగుతుందని పేర్కొన్నారు. భూమి కొలతలలో హెచ్చుతగ్గులుంటే దరఖాస్తు చేసుకుని, సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. గ్రామా ల్లోని భూ సమస్యల పరిష్కారానికి మళ్లీ కొలతలు, తదితర పనులను చేపట్టాల్సి ఉన్నందున, దరఖాస్తు చేసుకున్న 45 రోజుల్లోగా సమస్యను పరిష్కరించడం కలెక్టర్ పేర్కొన్నారు.

గతంలో ఏమైనా తప్పుగా డాక్యుమెంట్లు పంపిణీ చేస్తే వాటిని మళ్లీ క్షుణ్ణంగా పరిశీలించి, నిజమైన అర్హులకు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆస్తి తగాదాలు, భూ సమస్యలుంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సంగీత్ మహదూర్, తహసీల్దార్ శ్యామ్, విలేజ్ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీ4ఐ4 లేబొరేటరీ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలి

» ఏయూ అధికారులకు రిజిస్ట్రార్ ధనుంజయరావు ఆదేశం



ప్రదీప్‌ను సత్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

వెంకోజీపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీ4ఐ4 లేబొరేటరీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు ఆదేశించారు. త్వరలో ఇందుకు సంబంధించిన పరికరాలు పూర్తిస్థాయిలో ఏయూకు రానున్నాయని, దీనికి అనుగుణంగా అవసరమైన ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ పనులను సత్వరం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో రిజిస్ట్రార్‌తో సమర్థ ఉద్యోగ డైరెక్టర్ ప్రదీప్ కోపర్డేకర్ సమావేశం అయ్యారు. సెంటర్ ఫర్ ఇండస్ట్రీ 4.0 ఉపయోగాలను వివరించారు. సీ4ఐ4 ల్యాబ్ నుంచి వైవిధ్య కోర్సులను డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు ఎంఎస్‌ఎంఈ, ఇండస్ట్రీస్‌లో పని చేసే వారికి అందించవచ్చన్నారు. వీటి ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను మరింత పెంపొందించడం సాధ్యపడుతుందని చెప్పారు. భారతదేశం మ్యానుఫ్యాక్చరింగ్ రంగానికి కేంద్రంగా మారుతోందని, దీని కోసం విస్తృత స్థాయిలో నిపుణుల అవసరమని చెప్పారు. ఏయూకు అందించాల్సిన పరికరాలు సిద్ధంగా ఉన్నాయని వాటి పనితీరును పరీక్షించి త్వరలో ఏయూకు తీసుకొస్తామన్నారు.

రిజిస్ట్రార్ ధనుంజయరావు మాట్లాడుతూ జనవరి మొదటి వారం నాటికి పరికరాల ఏర్పాటుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అందిస్తామని చెప్పారు. ఈ ల్యాబ్ ఏర్పాటు చేయడం వల్ల పరిశ్రమలతో అనుసంధానించడం సాధ్యపడుతుందన్నారు. భవిష్యత్తులో ఏయూలో ఎలక్ట్రికల్ వెహికల్ (ఈవీ) ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఆటోమొబైల్ ఇండస్ట్రీకి ఎంతో ఉపయుక్తంగా నిలిచే ఈ ప్రయోగశాల విద్యార్థులకు ప్రత్యక్ష, పరోక్ష నైపుణ్యాలను, జ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఉండాలన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను నైపుణ్యాలతో సుసంపన్నం చేసి అందించడానికి ఈ ల్యాబ్ ఉపకరిస్తుందన్నారు. అనంతరం వర్సిటీ తరుపున సమర్థ ఉద్యోగ డైరెక్టర్ ప్రదీప్‌ను సత్కరించి జ్ఞాపకం బహూకరించారు. కార్యక్రమంలో ఆచార్యులు కె.శ్రీనివాసరావు, వజీర్ మోహమ్మద్, కె.బసవయ్య, యూనివర్సిటీ ఇంజనీర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ స్కేటింగ్‌లో రేయాన్స్‌కు 2 కాంస్య పతకాలు



రేయాన్స్‌ను అభినందిస్తున్న కోచ్ సత్య

రామ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మైసూర్‌లో జరిగిన 62వ నేషనల్ రోలార్ స్కేటింగ్ పోటీలో స్పెషల్ కిడ్స్ విభాగంలో ఏపీకి చెందిన రేయాన్స్ ముప్పాల రెండు కాంస్య పతకాలు సాధించాడు. 5 నుంచి 7 సంవత్సరాల స్పెషల్ కిడ్స్ (ఇంటెల్క్యువల్ డిజెబు లిటీ-ఆటిజం) స్పీడు స్కేటింగ్‌లో రేయాన్స్ ఈ పతకం సాధించడం విశేషం. ఈ సందర్భంగా కోచ్ డి.సత్యతో పాటు పలువురు రేయాన్స్‌కు అభినందించారు.

ఆధునికీకరణకు నోచుకోని చెరువు

» నిర్వహణ పట్టించుకోని అధికారులు
» సంరక్షించకుంటే కనుమరుగయ్యే పరిస్థితి



నిర్వహణ లేక అడుగంటిపోతున్న చెరువు, అధ్వానంగా ఉన్న పరిసరాలు

ఆరిలోవ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 13వ వార్డులోని దారపాలెంలో గల పుట్ట బంగారమ్మ ఆలయానికి ఆనుకొని ఉన్న చెరువు సంరక్షణ కొరవడడంతో అడుగంటి పోతోంది. ఈ చెరువే ఈ ప్రాంతవాసులకు ఆధారంగా ఉండేది. అయితే దీనికి ఎప్పుడూ మరమ్మతులు చేపట్టకపోవడం, గట్టులు పటిష్టంగా ఏర్పాటు చేయకపోవడంతో అంతకంతకూ రూపం కోల్పోతోంది. కింద ఇసుక మేటలు వేసి చెరువు అంతకంతకూ కుచించుకుపోతోంది. గట్లు పాడైపోయాయి. పెద్ద వర్షం వస్తే గండిపడిపోతుంటాయి. ఇక్కడే పుట్ట బంగారమ్మ ఆలయం ఉండడంతో అక్కడకు వచ్చే భక్తులు ఈ చెరువులోనే తమ అవసరాలు తీర్చుకునేవారు. అయితే ప్రస్తుతం నీరు లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

పురాతనమైన ఈ చెరువును దారపాలెం పరిసర కొండ ప్రాంతాల్లో గల గెడ్డల నుంచి నీరు చేరేది. కానీ ఆ ప్రాంతంలో లే అవుట్ వేయడం ద్వారా గెడ్డలు కనుమరుగు అయ్యాయి. దీంతో ఈ చెరువుకు నీరు రాకుండా పోతోంది. వర్షాకాలంలో చెరువు నిండినప్పటికీ నిర్వహణ లేకపోవడంతో తొందరగానే ఎండిపోతోంది. చెరువుకు నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే మరమ్మతులు చేపట్టడం ద్వారా వర్షాధారంగా వచ్చే నీటిని ఎక్కువ కాలం నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

శానిటేషన్ వర్కర్‌కు సన్మానం



రాజమ్మకు సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వెంకోజీపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలను పరిశుభ్రంగా ఉంచటంలో ఎంతగానో శ్రమిస్తున్న పాఠశాల శానిటరీ వర్కర్ (ఆయా) రాజమ్మను పాఠశాల విద్యార్థులు పండ్లు, కూరగాయలు, నిత్యావసర సరుకులు ఇచ్చి శాలువాతో సన్మానించారు. జీవీఎంసం 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ జ్యోతి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొని ఆయాను ఘనంగా సత్కరించారు. తమ ఆరోగ్యం కోసం శ్రమిస్తున్న వారిని గుర్తించి గౌరవించుకోవడం మంచి అలవాటని విద్యార్థులను ప్రిన్సిపాల్ జ్యోతి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జగన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఫలాలను క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లాలి

» జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్

పద్మనాభం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ద్వారా సంక్షేమ, అభివృద్ధి ఫలాలను క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్ అన్నారు. పద్మనాభంలోని ఎంపీడీవో, వెలుగు కార్యాలయాల్లో మండల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన పేదరికం లేని, స్నేహపూర్వక బాలలు, మహిళలు, పచ్చదనం పరిశుభ్రత, సమృద్ధి నీటి సరఫరా,సామాజిక న్యాయం, సుపరిపాలన కలిగిన గ్రామాలను తీర్చిదిద్దడానికి గ్రామ స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, ఎంపీడీవో విజయకుమార్, ఈవోఆర్డీ మీనాకుమారి, ఏవో జయ ఉమ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం



వెంకోజీపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏయూలో గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతున్న బి.సత్యనారాయణ అనే విద్యార్థికి గుడ్ థింకర్స్ గ్రూప్ రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసింది. మంగళవారం ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు చేతుల మీదుగా లెఫ్టినెంట్ పవన్ కుమార్ గండి, విశ్రాంత డిఫెన్స్ ఉద్యోగి, ఏయూ స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యార్థి బోకం త్రినాథ్ ఈ నగదును రిజిస్ట్రార్ చేతుల మీదుగా సత్యనారాయణకు అందజేశారు. గ్రూప్-1, గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మెయిన్స్‌కు సిద్ధమవుతున్న సత్యనారాయణ ప్రతిభను గుర్తించి వీరు ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు పాల్గొన్నారు. భవిష్యత్తులో సైతం సత్యనారాయణకు సహకారం ఇస్తామని ఈ సందర్భంగా ఆచార్య షారోన్‌రాజు తెలిపారు.



ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు వినతిపత్రం అందజేస్తున్న నూర్ బాషా ముస్లిమ్ సంఘం నాయకులు

మా సమస్యలు పరిష్కరించండి

» ఎమ్మెల్యే వెలగపూడికి నూర్ బాషా ముస్లింల వినతి

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు నూర్ బాషా ముస్లింల సంఘం నాయకులు కోరారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విశాఖ నూర్ బాషా ముస్లిమ్ సంక్షేమ సేవా సంఘం నాయకులు మంగళవారం కలసి సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. జిల్లాలో సుమారు నాలుగు లక్షల మంది జనాభా ఉంటున్నామని, తమ వాళ్లు నివసించే గ్రామాలకు సమీపంలో పూర్తి వసతులతో శ్మశానవాటికలను కేటాయించాలని కోరారు. రంజాన్, బక్రీద్ కార్యక్రమాలకు నమాజ్ చేసుకునేందుకు ప్రతి నియోజకవర్గంలో ఈద్‌గా స్థలం కేటాయించాలని, పెందుర్తి, ఎన్‌ఏడీ కొత్తరోడ్డు, కంచరపాలెం, చినవాల్తేర్, ముడసర్లోవ ప్రాంతాల్లో కబేళాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో నూ షాదీఖానా నిర్మించాలని, ఉర్దూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకునేలా తగిన కృషి చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని వెలగపూడి హామీ ఇచ్చారు.

పెన్షన్ అంటే గౌరవ ప్రదమైన జీవనానికి హక్కు



పెన్షనర్స్ డే వేడుకల్లో పాల్గొన్న పింఛనుదారులు

సిరిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ అంటే దానం కాదని ఇది ఉద్యోగ విరమణ తరువాత గౌరవప్రదమైన జీవనానికి హక్కు. అని ఏపీఆర్‌పీఏ గౌరవ అధ్యక్షుడు బీటీ మూర్తి అన్నారు .మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి వైవీ చంద్రచూడ్ తీర్పు ఆధారంగా డిసెంబరు 17న పెన్షనర్స్ డేను ఏపీఆర్‌పీఏ నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కనీస పెన్షన్‌ను రూ.9 వేలు, డీఏగా పెంచాలన్నారు. భర్త, భార్యకు వైద్య సదుపాయాలు కల్పించాలని రైల్వే ప్రయాణంలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెన్షనర్స్‌ను సన్మానించారు. సమావేశానికి కేఎం కుమార్ మంగళం అధ్యక్షత వహించగా, కన్వీనర్ ఎంవీ త్రినాథం, కోశాధికారి మూర్తి పాల్గొన్నారు.

ఏయూలో ఘనంగా పెన్షనర్స్ డే



పెన్షనర్లకు సన్మానిస్తున్న రెక్టార్ కిశోర్‌బాబు తదితరులు

వెంకోజీపాలెం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : ఏయూ నాన్ టీచింగ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు వయసు పూర్తి చేసుకున్న పెన్షనర్లకు అసోసియేషన్ తరపున సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఏపీ పెన్షనర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ గొలగాని అప్పారావు, అధ్యక్షుడు ఎన్.శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి సి.నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం పాఠశాల ఏర్పాటు అభినందనీయం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి, వేదికపై ముస్లిం పెద్దలు

ఆరిలోవ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవలో గల ఐదు మసీదులు కలసి ఒక ముస్లిం పాఠశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ముస్తాఫా కాలనీలో గల కమ్యూనిటి హాలులో ఈ పాఠశాలను ప్రారంభించారు. ఈ పాఠశాలలో ఉర్దూ, అరబిక్ పాఠాల బోధనకు ఇద్దరు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమన్నారు.ఈ పాఠశాలకు తన సహకారం ఉంటుందన్నారు. అనంతరం విద్యారులకు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, 11వ వార్డు ఇన్‌చార్జి ముగడ రాజారావు. ముస్లిం నేతలు, మత పెద్దలు పాల్గొన్నారు.

1 నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌పై ఆంక్షలు



ప్ల కార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులతో జేవీ రత్నం తదతరులు

పెదవాల్తేరు, డిసెంబరు 17, ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 1 నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌పై పూర్తి స్థాయి నిషేధం ఉంటుందని జీవీఎంసీ ప్రాజెక్టు ఆఫీసర్ దాట్ల వివేక్ వర్మ స్పష్టం చేశారు. మంగళవారం పెదవాల్తేరులోని విశాఖ ఐ ఆస్పత్రి సమీపంలో గల జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం విషయంలో అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ఎస్‌ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ ప్రమీల మంగరాజు, రవితేజ, అధ్యాపకురాలు మురహరరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌లో బోటు షికారు నిలిపివేత

సాగర్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రుషికొండ బీచ్‌లో నిర్వహిస్తున్న బోటు షికారును మంగళవారం నుంచి నిలిపివేశారు. అల్పపీడనం దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా బోటు షికారును నిలిపివేసినట్టు ఏపీటీడీసీ అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని సందర్శకులు గమనించాలని కోరారు. వాతావరణం అనుకూలించిన తరువాత బోటు షికారును పునఃప్రారంభిస్తామని పేర్కొన్నారు.

విలువిద్యలో మణిరత్నమే


గణేష్ మణిరత్నం

(విశాఖపట్నం స్పోర్ట్సు, ఆంధ్రజ్యోతి)

గణేష్ మణిరత్నం... విలువిద్య (ఆర్చరీ)లో దూసుకుపోతున్న యువ కెరటం. కాంపౌండ్ ఈవెంట్‌లో యూత్ వరల్డ్ చాంపియన్‌షిప్, ఏషియన్ యూత్ చాంపియన్‌షిప్, జాతీయ సీనియర్ అర్చరీ చాంపియన్‌షిప్, ఖేలో ఇండియా టోర్నీల్లో పతకాలు సాధించిన ఇతడు ఈ ఏడాది అక్టోబరులో చైనాలోని తైపీలో జరిగిన ఏషియన్ అర్చరీ యూత్ చాంపియన్‌షిప్ టోర్నీలో వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం, టీమ్ ఈవెంట్‌లో మరో స్వర్ణం కైవశం చేసుకున్నాడు.

గత ఏడాది జంషెడ్‌పూర్‌లో జరిగిన జాతీయ సీనియర్ అర్చరీ చాంపియన్‌షిప్ కాంపౌండ్ ఈవెంట్‌లో రజత పతకాన్ని అందించాడు. ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నా, పతకాలకు గురిపెడుతూ విజయం సాధిస్తున్నాడు. తగిన ప్రోత్సాహం లేక క్రీడా భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని వాపోతున్నాడు. ప్రస్తుతం బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మణిరత్నం ఒలింపిక్స్, ఆసియా, కామన్‌వెల్త్ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పతకాలు సాధించాలని ఉవ్విళ్లూరుతున్నాడు.

'బాబు' ముందుచూపునకు నిదర్శనం

రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు పాఠశాలస్థాయి నుంచి క్రీడాకారులను తీర్చిదిద్దే ప్రణాళికలు అమలుచేశారు. ఇందులో భాగంగా కర్ణాటకలోని రాహుల్ ద్రావిడ్ కెన్విక్ సంస్థతో కలిసి ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటుచేసిన అకాడమీల నుంచి జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదిగిన క్రీడాకారుల్లో గణేష్ మణిరత్నం ఒకడు. ఉమ్మడి విశాఖ జిల్లా పరవాడలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ స్పోర్ట్సు అథారిటీ భాగస్వామ్యంతో అర్చరీ, షూటింగ్ అకాడమీలను ఏర్పాటుచేసింది. ఈ అకాడమీలో అరంగేట్రం చేసిన మణిరత్నం అనతికాలంలోనే అంతర్జాతీయ విలువిద్యకారుడిగా ఎదిగాడు.

శాప్ అకాడమీలో శిక్షణ

గణేష్‌లోని పట్టుదలను గమనించిన గ్లోబల్ స్కూల్ యాజమాన్యం చదువు, వసతితోపాటు రాత్రి వేళ సాధన చేసేందుకు వీలుగా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటుచేసింది. దీంతో అనేక టోర్నీలలో పతకాలు సాధించి ఆకట్టుకున్నాడు. నైపుణ్యం మెరుగునకు కోచ్ మదన్ వద్ద శిక్షణ పొంది, జాతీయ, అంతర్జాతీయస్థాయికి చేరాడు. సొంతజిల్లా నెల్లూరు అయినప్పటికీ విశాఖ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ వివిధ పోటీల్లో అనేక పతకాలు సాధించాడు.


సాధించిన పతకంతో గణేష్

- గతంలో సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసిన అకాడమీల నుంచి ఎదిగిన క్రీడా కిశోరం
- పతకాలు కొల్లగొట్టినా ప్రభుత్వ ప్రోత్సాహం శూన్యం

మధ్యతరగతి కుటుంబమే

గణేష్ తండ్రి హరిప్రసాద్ సాధారణ ప్రైవేటు ఉద్యోగి. సాధారణ మధ్య తరగతి కుటుంబం. అయితే తనకు ఆర్థిక స్తోమత లేకపోయినా విలువిద్యలో కుమారుడి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. కొన్నిసార్లు టోర్నీల్లో పాల్గొనేందుకు అప్పు చేసి మరీ డబ్బు సమకూరుస్తున్నారు.

సహకరించని వైసీపీ

గణేష్‌కు గత వైసీపీ ప్రభుత్వం నుంచే కాకుండా రాష్ట్ర ఆర్చరీ సంఘం నుంచి కూడా సహకారం అందలేదు. వరల్డ్ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఎన్‌టీపీసీ కొంత ఆర్థిక సహాయం చేసింది. జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించిన ప్రతిసారీ ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, గత ప్రభుత్వ అధికారులను కలిసి సహకరించాలని కోరినా ప్రోత్సాహం దక్కలేదు.

ఆర్థికసాయం కోసం...

శాప్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదు. కనీసం కాంపౌండ్ బౌ, ఆరోస్ వంటి క్రీడా పరికరాలకు సాయం చేయలేదు. ఇంటర్నేషనల్ టోర్నీల్లో పాల్గొనేందుకు సొంతంగా ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఆర్థిక సహకారం అందిస్తే ఆసియా, కామన్‌వెల్త్ గేమ్స్‌లో సత్తా చాటి దేశానికి పతకాలు సాధిస్తాను.

– గణేష్ మణిరత్నం

ప్రతిభకు నిదర్శనాలు

- అక్టోబరులో చైనాలోని తైపీలో ఏషియన్ అర్చరీ యూత్ చాంపియన్‌షిప్ టోర్నీలో వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం
- టీం ఈవెంట్‌లో మరో స్వర్ణం కైవసం...
- గత ఏడాది ఐర్లాండ్‌లో జరిగిన వరల్డ్ అర్చరీ యూత్ చాంపియన్‌షిప్ టోర్నీలో రజత పతకం...
- సోనిపట్‌లో జరిగిన వరల్డ్ అర్చరీ యూత్ చాంపియన్‌షిప్ ట్రయల్స్ టోర్నీలో స్వర్ణ పతకం...
- మధ్యప్రదేశ్‌లో జరిగిన నాల్గవ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రజత పతకం...
- జంషెడ్‌పూర్‌లో జరిగిన జాతీయ సీనియర్ అర్చరీ టోర్నీలో రతజ పతకం....
- మహారాష్ట్రలో జరిగిన సీబీఎస్ఈ జాతీయ అర్చరీ టోర్నీలో స్వర్ణం...
- గోవాలో ఎన్‌టీపీసీ జాతీయ జూనియర్ అర్చరీ టోర్నీలో రజతం...
- ఝార్ఖండ్‌లో 16వ ఎన్‌టీపీసీ సీనియర్ అర్చరీ చాంపియన్‌షిప్ టోర్నీలో రజతం

అబాకస్‌లో జ్యోష్నశ్రీ దేవాన్షికి ద్వితీయస్థానం


అవార్డు అందుకుంటున్న జ్యోష్నశ్రీదేవాన్షి

విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన ఇంటర్నేషనల్ అబాకస్ పోటీల్లో దొండపూడి గ్రామానికి చెందిన చుక్కల స్వామిమాస్టారు కుమార్తె చుక్కల జ్యోష్నశ్రీ దేవాన్షి పాల్గొని అబాకస్ ఎ2 విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. 30 దేశాలకు చెందిన పదివేల మందికి పైగా విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అదే రోజు ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఇంటర్నేషనల్ అబాకస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ డినో వ్యాంగ్, ఇండియన్ అబాకస్ అధ్యక్షుడు డాక్టర్ స్నేహల్ కారియా చేతులమీదుగా చుక్కల జ్యోష్నశ్రీ దేవాన్షి అవార్డు అందుకుంది.

కేంద్రీయ విద్యాలయలో మెరైన్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతీయమత్స్య పరిశోధనా సంస్థ మంగళవారం 104 ఏరియా కేంద్రీయ విద్యాలయ 1,2లో మెరైన్ ఎగ్జిబిషన్, అవగాహనా సదస్సు నిర్వహించింది. కేంద్రీయ విద్యాలయ-2 ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు ప్రారంభించారు. సముద్ర మత్స్య వనరులు, మెరైన్ ప్లాస్టిక్, తెగిన వలలపై ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన సదస్సులో అరుదైన మత్స్య వనరులు, కృత్రిమ చేపల ఆవాసాలు, నౌకలో పరికరాలు, నావిగేషన్, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, లైఫ్ సేవింగ్ అండ్ అగ్నిమాపక ఉపకరణాలు, మత్స్య సంపద అభివృద్ధికి దోహదపడే అంశాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మత్స్య పరిశోధనాసంస్థ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి, మత్స్య పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త పాల్గొని గోస్ట్ ఫిషింగ్ వలలు, సముద్రంలోని ప్లాస్టిక్ వ్యర్థాలతో సాగర జలాలు కలుషితమై మత్స్య సంపదకు నష్టం జరిగే విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రదర్శనను తిలకించారు.

సింహాద్రి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో ఉత్పత్తిని మంగళవారం పునరుద్ధరించారు. యూనిట్ బాయిలర్ ట్యూబులకు రంధ్రాలు పడడంతో శనివారం అర్ధరాత్రి ఉత్పత్తి నిలిచిపోయిన సంగతి తెలిసిందే. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి మూడు రోజుల్లో పునరుద్ధరించారు.

రైతుబజార్లలో స్టాల్స్ కేటాయింపునకు రేపు డ్రా

డాబాగార్డెన్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైతుబజార్లలో అద్దె ప్రతిపాదికన స్టాల్స్ కేటాయింపునకు ఈ నెల 19న సాయంత్రం 4 గంటలకు డ్రా తీస్తామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. దరఖాస్తుదారుల సమక్షంలోనే 23 డ్వాక్రా, 7 పీహెచ్‌సీ స్టాల్స్‌కు కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీస్తామన్నారు. ఇతర వివరాలకు 90308 19082 నంబరులో సంప్రదించాలని కోరారు.

సుస్థిర వ్యాపారానికి ప్రణాళికలు అవసరం

- సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ


సమ్మిట్‌లో మాట్లాడుతున్న సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ

ఎండాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థిరమైన వ్యాపారం చేయాలంటే ఎగుమతి, దిగుమతుల సమ్మతిని అర్థం చేసుకోవాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఏపీ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. నగరంలో గల ఐఐఎంలో సీఐఐ ఏపీ ఆధ్వర్యంలో 'పటిష్ఠమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం, వృద్ధి, ప్రపంచ అనుసంధానాలను ప్రోత్సహించడం' అంశంలో ప్రపంచ మార్కెట్ యాక్సెస్‌పై మంగళవారం నిర్వహించిన సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఏపీ మెడ్‌టెక్ జోన్ సీఈవో సీఎంఎ కల్లా గౌతమ్ ఏపీలో ఎగుమతుల పరిస్థితిని వివరించారు. పర్యావరణ వ్యవస్థను, పరిశ్రమ మద్దతును మెడ్‌టెక్ జోన్ పరిచయం చేసిందన్నారు. ఇంపెక్స్ ఫెడరేషన్ సీఈవో అభిజిత్ షిండే ఎగుమతి, దిగుమతుల ప్రక్రియలో పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రస్తావించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు ప్రపంచ ఆర్థిక సమగ్రతలో ఏపీ పాత్రపై చర్చించారు. సమ్మిట్‌లో డీజీఎఫ్‌టీ జాయింట్ డైరెక్టర్ ఎస్సీ అక్షయ్, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి జంగం, ఎక్స్‌పోర్టు ఇన్‌స్పెక్షన్ ఏజెన్సీ అసిస్టెంట్ డైరెక్టర్ సుదాన్ సుశేఖర్ దాస్, ఈసీజీసీ బ్రాంచ్ మేనేజర్ చిరన్‌దత్తా, ఎంపీఈడీఏ జోనల్ హెడ్ ప్రసాద్ నాయక్, ఇండియన్ ఎగ్జిమ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ శైలేష్ ప్రసాద్ మాట్లాడారు.

'గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలి'


జ్ఞాపిక అందుకుంటున్న గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు భార్గవి

సాగర్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్.భార్గవి అన్నారు. రుషికొండ గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ కార్యాలయంలో మంగళవారం పాడేరు, పార్వతీపురం, సీతంపేట, చింతూరు, కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, వెలుగు, జీసీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. వన్‌ధన్ వికాస కేంద్రాల సభ్యులకు అందించిన శిక్షణ, ఉత్పత్తులు, భవన నిర్మాణాలు, మౌలిక యంత్ర పరికరాల కొనుగోలుపై సమీక్షించారు. వీడీవీకేలు చేస్తున్న ఉత్పత్తులు, మార్కెటింగ్ సదుపాయాలను బలోపేతం చేయాలని ఆమె ఆదేశించారు. సేకరించిన అటవీ ఉత్పత్తులకు అదనపు విలువలు జోడించి, మంచి బ్రాండింగ్ చేయాలని సూచించారు. అడ్డాకులతో తయారు చేసిన ప్లేట్లను పరిశీలించి నిర్ణయించిన ధరలను తెలుసుకున్నారు. సింహాచలం, తిరుమల తిరుపతి దేవస్థానాలకు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ పాడేరు పరిధిలో 106 వీడీవీకేలున్నాయని, రూ. 3.1 కోట్లతో యంత్ర పరికరాలు సమకూర్చి, సభ్యులకు అవసరమైన శిక్షణ అందించామన్నారు. ఇంకా రూ1.51 కోట్ల నిధులు వీడీవీకేల ఖాతాల్లో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జీసీసీ ఎండీ కల్పనాకుమారి, రంపచోడవరం పీవో కట్టా సింహాచలం, చింతూరు పీవో అపూర్వ భరత్, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆకట్టుకునేలా బోధించాలి: డీఈవో


కంచరపాలెంలో టీచర్‌తో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

కంచరపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆశించిన స్థాయిలో అభ్యసనా సామర్థ్యాలను సాధించడానికి ప్రతి ఉపాధ్యాయుడు ప్రేరణాత్మకమైన బోధన అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ సూచించారు. జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలను డీఈవో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో పలు తరగతి గదుల్లోకి వెళ్లి ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఆకట్టుకునేలా బోధించి వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. సకాలంలో పాఠశాలల్లో ముఖ హాజరును నమోదు చేయాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి గదిని పరిశీలిస్తూ విద్యార్థులతో ముచ్చటించారు. పలు ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో జరుగుతున్న సమ్మేటివ్ పరీక్ష నిర్వహిస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు.సమన్వయంతో ఉపాధ్యాయులు పనిచేసి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఆర్.శ్రీనివాసరావు, మేరీ జసింత, పీఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్ వర్సిటీ ఫుట్‌బాల్ టోర్నీకి ఏఎంసీ విద్యార్థి


రామాంజనేయులును అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత జాతీయ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఫుట్‌బాల్ జట్టుకు ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థి జె.వి.రామాంజనేయులు ఎంపికయ్యాడు. ఈ నెల 21 నుంచి కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో జరిగే ఈ టోర్నీలో డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఫుట్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈ సందర్భంగా ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మంగళవారం తన కార్యాలయంలో రామాంజనేయులును అభినందించి ప్రతిభ ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర వైద్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ పాత్రుడు పాల్గొన్నారు.

రెండు మద్యం ప్రీమియం స్టోర్‌లకు నోటిఫికేషన్

- ఈనెల 31 వరకూ దరఖాస్తులకు అవకాశం

విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు మద్యం ప్రీమియం స్టోర్‌ల ఏర్పాటుకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ మంగళవారం నోటిఫికేషన్ జారీచేశారు. ఐదేళ్ల వ్యవధికి లైసెన్స్ జారీచేసే ప్రీమియం స్టోర్‌కు లైసెన్స్ ఫీజు కింద ఏడాదికి రూ.కోటి చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెండో ఏడాది నుంచి పదిశాతం చొప్పున ఏటేటా లైసెన్స్ ఫీజు పెరుగుతుందన్నారు. స్టోర్ ఏర్పాటు చేయడానికి కనీసం నాలుగువేల చదరపు అడుగుల వైశాల్యం కలిగిన దుకాణం ఉండాలన్నారు. ప్రీమియం స్టోర్‌లో కేవలం మద్యం బ్రాండ్‌లను ప్రదర్శించేలా, కొనుగోలుదారులకు ఆకర్షణీయంగా, కావాల్సిన బ్రాండ్‌ను ఎంపిక చేసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. స్టోర్ కోసం దరఖాస్తు చేసేవారు దరఖాస్తు ఫీజు కింద రూ.15 లక్షలు డీడీ తీయాలని, ఆ మొత్తాన్ని తిరిగి వెనక్కి ఇచ్చే అవకాశం లేదని వివరించారు. ఆసక్తిదారులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లోగానీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలోగానీ అందజేయాల్సి ఉంటుందన్నారు.

రహదారిపై ఉప్పొంగిన మురుగు


చెత్తతో నిండిపోయిన మురుగు కాలువ


రహదారిపై మురుగునీటిని దాటుతున్న యువతి

డాబాగార్డెన్స్‌లో ఇటీవల కొత్త షాపింగ్ మాల్ ప్రారంభమైంది. అక్కడ విపరీతమైన రద్దీ నెలకొంటోంది. అక్కడే మురుగు కాలువ చెత్తాచెదారంతో నిండిపోయింది. దాంతో మురుగునీరు రహదారిపై కాలువలా ప్రవహిస్తోంది. ఆ మార్గంలో వెళ్లేవారు అందులో దిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పలువురు ఈ విషయాన్ని జీవీఎంసీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదు.

– విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

క్రైం... crime news

వ్యక్తి ఆత్మహత్య


రాంబాబు మృతదేహం

ఆనందపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఎల్‌వీపాలెం గ్రామానికి చెందిన కంచుబోయిర రాంబాబు(31) వ్యవసాయ కూలీ. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పనిమీద బయటకు వెళ్లిన అతడి భార్య కొండమ్మ సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంటికి వచ్చి తలుపులు తట్టినా తీయకపోవడంతో అనుమానంతో చుట్టు పక్కల వారిని పిలిచి తలుపులు బద్దలుకొట్టి ప్రవేశించగా రాంబాబు మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో 12 కేజీల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని అతడి నుంచి రూ.60 వేలు విలువైన 12 కిలోలగంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ ఫరూక్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబు సిబ్బందితో ప్లాట్‌ఫారాలపై తనిఖీలు చేస్తుండగా ఢిల్లీకి చెందిన మహ్మద్ ముజామిల్ రైల్లో గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడని తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు.

ఆరుగురు మృతికి కారణమైన డ్రైవర్‌కు పదేళ్ల జైలు

విశాఖ లీగల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆరుగురు వ్యక్తుల మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు పదేళ్ల జైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరునెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానంద అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన కె.తరుణ్ లారీ డ్రైవర్. 2017 ఏప్రిల్ 19న చింతపల్లి నుంచి జీకే వీధి వైపు లారీ వెళ్తుండగా వీఆర్‌నగర్ జంక్షన్ వద్ద ట్రిపుల్ రైడింగ్‌తో వెళ్తున్న బైక్‌ను తప్పించే యత్నంలో వారిని ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు ముగ్గురు మృతిచెందారు. భయాందోళనతో తరుణ్ లారీ నుంచి దూకేశాడు, దీంతో లారీ రోడ్డు పక్కనున్న మరో ముగ్గురిని ఢీకొంది. దీంతో వారు కూడా మృత్యువాత పడ్డారు. మొత్తం ఆరుగురు మృతికి కారణమైన ఈ ఘటనపై అప్పటి చింతపల్లి డీఎస్పీ అనిల్ పులపాటి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి ముద్దాయికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

బ్రెయిన్‌డెడ్ వ్యక్తి అవయవదానం


మురళీకృష్ణ (ఫైల్ ఫొటో)

సింహాచలం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 98వ వార్డు పరిధి ప్రియాగార్డెన్స్‌కు చెందిన జర్నలిస్టు ఉరుకూటి మురళీకృష్ణ (52)కు బ్రెయిన్‌డెడ్ అవడంతో అతడి కుటుంబసభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. మురళి ఈనెల 14న ద్విచక్రవాహనంపై స్టీల్‌ప్లాంట్ రోడ్డు స్పీడ్ బ్రేకర్‌పై అదుపు తప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయమయింది. మెదడు నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో వెనుక వస్తున్న అతని సోదరుడు గమనించి కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో అవయవదానంపై వైద్యులు కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. భార్య శిరీష సమ్మతించడంతో జీవన్‌దాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ రాంబాబుకు సమాచారం ఇచ్చా రు. ఆయన వెంటనే అవయవాలు సేకరించేందుకు అనుమతించారు. నాలుగు అవయవాలను రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులకు గ్రీన్‌చానల్‌ద్వారా తరలించారు. మురళీకృష్ణ పార్థివదేహానికి డా.రాంబాబు నివాళులర్పించి, ప్రభుత్వం తరఫున అంత్యక్రియలకు రూ.10 వేలు, అవయవదాన ధ్రువపత్రాలను కుటుంబసభ్యులకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


కూర్మన్నపాలెం,డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన వడ్లపూడి వంతెనపై మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా వున్నాయి. నర్సీపట్నం మునిసిపాలిటీ జోగునాయుడుపాలేనికి చెందిన పి.వరహాలుబాబు (30), వి.శ్రీనివాసరావు ద్విచక్రవాహనంపై మంగళవారం గాజువాక వచ్చారు. ఇక్కడ పని పూర్తిచేసుకుని రాత్రి కూర్మన్నపాలెం వైపు వస్తుండగా, వడ్లపూడి పైవంతెనపై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వరహాలు బాబును 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును అతడి స్నేహితుడు వెంకటరమణ షీలానగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. కాగా అతడి చెవి నుంచి తీవ్ర రక్తస్రావమవుతోందని సమాచారం. ఇతడు నర్సీపట్నం మునిసిపాలిటీ మాజీ కౌన్సిలర్ అని తెలిసింది. ఈ ఘటనపై గాజువాక, దువ్వాడ పోలీసుల మధ్య సరిహద్దు వివాదం నేపథ్యంలో ఆలస్యంగా దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గీతంలో సిలికాన్ ల్యాబ్స్ ఇన్నోవేషన్ సెంటర్


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

సాగర్‌నగర్, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అమెరికాకు చెందిన బహుళజాతి సెమీకండక్టర్ తయారీ, డిజైనింగ్ సంస్థ సిలికాన్ ల్యాబ్స్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇన్నోవేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయనుంది. ఇం దులో భాగంగా మంగళవారం గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ డైరెక్టర్ (ఇంజినీరింగ్) ఎస్.వెంకటేష్ అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నారు. పారిశ్రామిక అవసరాలకు తగిన మానవ వనరులను తీర్చిదిద్దడంతో పాటు పరిశోధనలకు గీతం ప్రాధాన్యత ఇస్తోందని ఇన్‌చార్జి వీసీ తెలిపారు. సిలికాన్ ల్యాబ్స్ డైరెక్టర్ ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ గీతంలో ఏర్పాటు చేస్తున్న ఐఓటి ఇన్నోవేషన్ సెంటర్ ద్వారా హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లపై అధ్యాపకులకు విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఏకే ప్రసాదరావు, డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, చీఫ్ ఇన్నోవేటివ్ ఆఫీసర్ ఎన్.క్రిష్, ఈఈసీఈ విభాగాధిపతి డాక్టర్ భరణిచంద్ర, కెరీర్ గైడెన్స్ సెంటర్ అధిపతి కె.ఉమాదేవి, డైరెక్టర్ వంశీకిరణ్ సోమయాజులు పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్లు పయనం


ఖోఖో పోటీల్లో పాల్గొననున్న రాష్ట్ర బాలురు, బాలికల జట్లు

అనకాపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఈనెల21 నుంచి 24 వరకు జరగనున్న 68వ జాతీయ స్కూల్‌గేమ్స్ ఖోఖో చాంపియన్‌షిప్ అండర్-19 పోటీల్లో పాల్గొనే ఏపీ బాల,బాలికల జట్లు మంగళవారం అనకాపల్లి నుంచి బయలుదేరాయి. క్రీడాకారులకు తుమ్మపాల ఉన్నత పాఠశాలలో డీఈవో జి.అప్పారావునాయుడు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. **బాలుర జట్టు:** జి.అజయ్ (విశాఖ), బి.సాయి (విశాఖ), సీహెచ్.చరణ్ (విశాఖ), డి.వినయ్ (ప్రకాశం), పి.నరేష్ (ప్రకాశం), డి.రాకేశ్ (కృష్ణా), ఎం.శివ (విజయనగరం), బి.తిరుమల (శ్రీకాకుళం), ఐ.శేషనార్‌గౌడ్ (అనంతపురం), ఎస్.నవీన్ (నెల్లూరు), జె.యల్లప్ప (కర్నూలు), బి.పవన్ (చిత్తూరు). **బాలికల జట్టు:** కె.లాస్య (విశాఖ), పి.జోత్స్న (విశాఖ), జె.గీత (విశాఖ), సీహెచ్.లావణ్య (విజయనగరం), బి.భార్గవి (నెల్లూరు), కె.పవిత్ర (నెల్లూరు), డి.రంగమహాలక్ష్మి (గుంటూరు), కె.దివ్య (పశ్చిమగోదావరి), ఎస్.హస్మిత (చిత్తూరు), జి.దేవి (కడప), జి.భవాని (శ్రీకాకుళం), బి.కల్యాణి (ప్రకాశం). బాలికల జట్టు కోచ్‌గా కేఎంనాయుడు, మేనేజర్‌గా పి.లక్ష్మి వ్యవహరిస్తారు.